మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

నేటి
# ఈవార్తలు
NETI EVARTHALU
దినపత్రిక

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

సోమవారం MONDAY 19-1-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 || సంచిక: 200 Issue: 200

19 జనవరి 2026 - సోమవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు మాఘ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:53 సూర్యాస్తమయం - సా. 6:00 తిథి పాడ్యమి రా. 2:12ం వరకు తరువాత విదియ సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం ఉత్తరాషాఢ ఉ. 11:42 వరకు తరువాత శ్రవణ యోగం వజ్ర రా. 8:37 వరకు కరణం స్తుష్నుమ మ. 1:48 వరకు బవ రా. 2:12ం వరకు వర్జ్యం సా. 4:04 నుండి సా. 5:45 వరకు దుర్ముహూర్తం మ. 12:48 నుండి మ. 1:33 వరకు మ. 3:02 నుండి మ. 3:46 వరకు రాహుకాలం ఉ. 8:16 నుండి ఉ. 9:40 వరకు యమగండం ఉ. 11:03 నుండి మ. 12:26 వరకు గుళికాకాలం మ. 1:50 నుండి మ. 3:13 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:17 నుండి ఉ. 6:05 వరకు అమృత ఘడియలు రా. 2:09 నుండి తె. 3:50 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:04 నుండి మ. 12:49 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com


## కాంగ్రెస్‌లో చేరి తప్పు చేశా

### ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



పటాన్‌చెరు (సంగారెడ్డి), జనవరి 18 (ఈవార్తలు): కాంగ్రెస్‌లో ఉండటం వల్ల ఎలాంటి లాభం లేదంటూ పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పటాన్ చెరు జీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో తన అనుచరులతో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అప్పటి పరిస్థితుల దృష్ట్యా తప్పటడుగు వేసి కాంగ్రెస్ పార్టీలో చేరానంటూ వ్యాఖ్యానించారు. 'మూడు సార్లు బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచాను కాబట్టి మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరం ఉంది. పటాన్ చెరు నియోజక వర్గంలోని 5 మున్సిపాలిటిల్లోని 104 కౌన్సిలర్లను గెలిపించేందుకు విభాగాల వారీగా పని చేద్దాం' అని మహిపాల్‌రెడ్డి అన్నారు.

### బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,378 |
| వెండి (గ్రాము): | రూ.310 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,814 |

### విశ్వవాణి



ప్యారట్ ఫిష్ అనే చేప నిద్రపోయేముందు ఒక బుడగను శరీరం చుట్టూ నిర్మించుకుంటుంది. తన వాసనను ఇతర జలచరాలు గుర్తించేందుకు వీల్లేకుండా, శత్రువుల నుంచి రక్షణగా దాన్ని ఏర్పాటు చేసుకుంటుందని ఆ చేపలపై చేసిన పరిశోధనల్లో తేలింది.

తెలంగాణ ఇచ్చినా పదేళ్ల పాటు ప్రతిపక్షంలో ఉన్న పార్టీ అది.. కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో లేక బిక్కుబిక్కుమన్నది. సరే పోనీ, మార్పు అంటోంది కదా అని తెలంగాణ ప్రజలు ఒక చాన్స్ ఇచ్చారు. ఆ చాన్స్‌ను కూడా ఉపయోగించుకోలేని స్థితిలో కాంగ్రెస్ పార్టీ ఉందా..!

అంటే రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు అవుననే అంటున్నాయి. ఒక మంత్రి ఇంకో మంత్రిని తిట్టడం, ఒక ఎమ్మెల్యే తోటి ఎమ్మెల్యేకే సవాల్ విసరడం.. పార్టీలోకి వచ్చిన ఎమ్మెల్యే ఇజ్జత్ తీయడం.. ఇలా అంతా భస్మాసురులేనా! అన్న అనుమానం కలుగుతోంది.

తాజాగా, ఇద్దరు మంత్రులపై ప్రముఖ మీడియాల్లో వచ్చిన కథనాలు పార్టీని, ప్రభుత్వాన్ని ఇరకాటంలో పడేస్తున్నాయి. మంచిగ పాలన చేసుకోండని ప్రజలు అవకాశం ఇస్తే అవసరం లేని పంచాయితీలతో కాలం గడుస్తోంది తప్ప ప్రజలకు ఏం ఉపయోగం ఉండటం లేదు.



# మంత్రులకు.. వెన్నుపోట్లు!

## మీడియాల్లో వరుస వ్యతిరేక కథనాలు



ఇటీవల ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సంస్థల అధినేత రాధాకృష్ణను కలిసిన సీఎం రేవంత్ రెడ్డి (ఫైల్)

### మా మంత్రులను బద్నాం చేయొద్దు: రేవంత్

**మంత్రులపై** వార్తలు రాసే ముందు తన వివరణ తీసుకోవాలని మీడియాను సీఎం రేవంత్ కోరారు. వివరణ ఇవ్వడానికి తాను సిద్ధంగా ఉన్నట్టు రేవంత్‌రెడ్డి చెప్పుకొచ్చారు. తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రాసలీలలంటూ ఎన్టీవీ చానెల్ కథనాన్ని ప్రసారం చేయడం తీవ్ర వివాదాస్పదమైంది. ఆ కథనం తరువాయి 2 వ పేజీలో...

### పని కట్టుకొని టార్గెట్ చేస్తున్నట్లు డౌట్

### పొంగులేటితో మొదలైన లీకుల పర్వం

### కోమటిరెడ్డి, భట్టి వరకు అంతా బాధితులే

గత కొద్ది రోజులుగా తెలంగాణ మంత్రుల పనితీరుపై, వారి వ్యక్తిగత వ్యవహారాలపై మీడియాలో వస్తున్న వరుస కథనాలు రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతున్నాయి. దశాబ్దం కాలం తర్వాత అధికారంలోకి వచ్చిన ఉత్సాహం కాంగ్రెస్ శ్రేణుల్లో ఉన్నప్పటికీ, పదవుల పంపకం దగ్గర మొదలైన అసంతృప్తి ఇప్పుడు పతాక స్థాయికి చేరింది. మంత్రులపై కొందరు వ్యతిరేకతను పెంచి పోషిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కీలక శాఖలు నిర్వహిస్తున్న మంత్రులను టార్గెట్ చేస్తూ, వారి శాఖల్లో జరుగుతున్న పొరపాట్లను భూతద్దంలో చూపిస్తూ మీడియాకు లీకులు ఇస్తున్న విషయం తెలుస్తున్నదే.

(ఈవార్తలు - పొలిటికల్ డెస్క్)

రాజకీయాల్లో ప్రత్యర్థులు విమర్శలు చేయడం సహజం. మంత్రుల నియోజకవర్గాల్లోని ప్రత్యర్థి వర్గాలకు సహకరించడం, సోషల్ మీడియా వేదికగా మంత్రుల ప్రతిష్టను దిగజార్చేలా ప్రచారాలు చేయించడం వంటి చర్యలు పార్టీ ప్రతిష్టను మసకబారుస్తున్నాయి. ఇది కేవలం మంత్రుల వ్యక్తిగత ఇమేజ్‌ను మాత్రమే కాదు, మొత్తం ప్రభుత్వ సమర్థతను కూడా ప్రశ్నార్థకం చేస్తోంది. మంత్రుల వ్యక్తిగత సిబ్బంది వ్యవహారాలు, పాత సెటిల్మెంట్లు, శాఖల వారీగా జరుగుతున్న బదిలీల్లో అవకతవకలు వంటి అంశాలపై వరుసగా కథనాలు రావడం వెనుక పక్కా ప్రణాళిక కనిపిస్తోంది. ఈ సమాచారం అంతా బయటి వ్యక్తులకు అందే అవకాశం తక్కువ. అంటే, మంత్రుల కదలికలను నిశితంగా గమనిస్తున్న సొంత నేతలే ఈ సమాచారాన్ని అందిస్తున్నారని స్పష్టమవుతోంది.

#### ప్రముఖ మీడియాలో ఆరోపణలు

కొంతకాలం క్రితం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లక్ష్యంగా కొన్ని చానళ్లలో కథనాలు ప్రసారం అయ్యాయి. కొన్ని రోజుల క్రితం ఒక మహిళా ఐఏఎస్‌తో మంత్రి కోమటిరెడ్డి సన్నిహితంగా ఉన్నారంటూ ఎన్టీవీ ఒక కథనాన్ని ప్రసారం చేసింది. తాజాగా, తరువాయి 2 వ పేజీలో...

# బీసీలకు దగా

## 42 రిజర్వేషన్ సంగతేంది?.. ప్రభుత్వంపై ఆర్ కృష్ణయ్య ధ్వజం



మున్సిపల్ ఎన్నికలకు పోవాలని ప్రభుత్వం ప్రకటించడం రాజ్యాంగ విరుద్ధం అని రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య అన్నారు. 42 శాతం బీసీల రిజర్వేషన్ల కేసు కోర్టులో నడుస్తున్నప్పుడు, ఎన్నికలకు ఎలా పోతారని ప్రశ్నించారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ర్యాగ అరుణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ఆర్ కృష్ణయ్య మాట్లాడారు.

ఆబిడ్స్/హైదరాబాద్, జనవరి 18 (ఈవార్తలు): కేసు తీర్పు వచ్చే వరకు వేచిఉండకుండా.. ఎన్నికలకు పోవడం బీసీలను దగా చేయడమే అని అన్నారు. ప్రభుత్వం మొదటి నుండి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అంటూ ఊరించి మోసం చేసిందన్నారు. ముఖ్యమంత్రి బీసీ వ్యతిరేక వైఖరి మార్చుకోవాలని సూచించారు. అధికారులు ప్రకటించిన లెక్కల ప్రకారం బీసీలకు రిజర్వేషన్లను 28 శాతానికి కుదించారన్నారు. బీసీలకు 65 మున్సిపాలిటీలకు గాను 35 స్థానాలు.. కార్పొరేషన్ లలో 10 స్థానాలకు 3 మాత్రమే తరువాయి 2 వ పేజీలో...



# 'పుర' పోరుకు పచ్చజెండా

## ఫిబ్రవరిలో నిర్వహణకు ఓకే

### వచ్చే ఏడాది జూలై 27 నుంచి గోదావరి పుష్కరాలు

### మేడారం కేబినెట్‌లో కీలక నిర్ణయాలు

తొలిసారి హైదరాబాద్ వెలుపల, ములుగు జిల్లా మేడారంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన తెలంగాణ కేబినెట్ భేటీ ముగిసింది. దాదాపు రెండున్నర గంటలపాటు జరిగిన భేటీలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆదివారం జరిగిన ఈ సమావేశంలో మున్సిపల్ ఎన్నికలకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వటంతో పాటు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

మేడారం/ములుగు, జనవరి 18 (ఈవార్తలు): రాష్ట్రంలో పదవీ కాలం ముగిసిన 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో 2996 వార్డులు, డివిజ న్లలో ఎన్నికలు జరపాల్సి ఉంది. డెడికేటెడ్ కమిషన్ నివేదిక ప్రకారం రిజర్వేషన్ల ప్రక్రియ కూడా పూర్తి అయింది. అందుకే ఫిబ్రవరిలోనే మున్సిపల్ ఎన్నికలకు అవసరమైన-2 వ పేజీలో...

# బాగా తాగేశారేంటండీ..!

## ఏపీలో సంక్రాంతికి ఏరులై పారిన లిక్కర్

### వారంలోనే 877 కోట్ల మద్యం అమ్మకం



విజయవాడ, జనవరి 18 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో సంక్రాంతి పండుగ సందర్భంగా మద్యం అమ్మకాలు భారీగా పెరిగాయి. జనవరి 9 నుంచి 16 వరకు కేవలం వారం రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా రూ. 877 కోట్ల విలువైన మద్యం విక్రయాలు నమోదయ్యాయి. పండుగ వాతావరణం, సెలవులు, గ్రామాలకు వలస వెళ్లిన ప్రజల కారణంగా మద్యం దుకాణాల వద్ద రద్దీ స్పష్టంగా కనిపించింది. ఈ అమ్మకాలు గత సంవత్సరాలతో పోలిస్తే గణనీయంగా ఎక్కువగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. సాధారణ రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లో రోజుకు తరువాయి 2 వ పేజీలో...



# కోటరీలో బందీ.. గుర్తించు!

### విజయసాయిరెడ్డి ట్వీట్ రచ్చ

విజయవాడ, జనవరి 18 (ఈవార్తలు): ఏపీలో జరుగుతున్న పరిస్థితులు, నాయకులను ఉద్దేశించి మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి చేసిన ట్వీట్ చర్చనీయాంశంగా తరువాయి 2 వ పేజీలో...

ఈవార్తలు



# రాశి ఫలాలు

19.1.2026

**మేషం:** దూరప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. ఇంటా బయట అకారణ వివాదాలు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. చేపట్టిన పనులు మందకోడిగా సాగుతాయి.

**వృషభం:** సన్నిహితుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తవుతాయి. వ్యాపార వృత్తి ఉద్యోగాలలో అధికారుల అనుగ్రహం కలుగుతుంది. వ్యాపారాలు లాభిస్తాయి. ఆదాయం ఆశించిన విధంగా ఉంటుంది. విలువైన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు.

**మిధునం:** ఆకస్మిక ధన లాభ సూచనలున్నవి. వ్యాపారాల్లో ఆశించిన పురోగతి సాధిస్తారు. మిత్రుల నుండి కీలక సమాచారం సేకరిస్తారు. స్థిరాస్తి వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. ఉద్యోగాలలో సమస్యలు పరిష్కారమౌతాయి. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**కర్కాటకం:** వ్యాపార వ్యవహారాలలో ఒడిదుడుకులు తప్పవు. వృత్తి ఉద్యోగాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఆదాయం అంతంత మాత్రంగా ఉంటుంది. నూతన ఋణ ప్రయత్నాలు కలసిరావు. దూర ప్రయాణ సూచనలున్నవి. కుటుంబ సభ్యులతో మాట పట్టింపులుంటాయి.

**సింహం:** ఉద్యోగమున అధికారులతో సమస్యలు తప్పవు. రావలసిన సొమ్ము సకాలంలో చేతికి అందక ఇబ్బంది పడతారు. చేపట్టిన పనులు మందగిస్తాయి. దైవ చింతన పెరుగుతుంది. దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. వృత్తి వ్యాపారాలలో శ్రమ తప్ప ఫలితం కనిపించదు.

**కన్య:** వ్యాపారాలలో నూతన ఆలోచనలు అమలు చేస్తారు. భూ క్రయ విక్రయాలలో లాభాలు అందుకుంటారు. వృత్తి ఉద్యోగాలు సంతృప్తికరంగా సాగుతాయి. నూతన వ్యక్తుల పరిచయాలు ఉత్సాహనిస్తాయి. సన్నిహితుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి.

**తుల:** బంధు మిత్రులతో వివాదాలు పరిష్కారమౌతాయి. సంఘంలో ప్రముఖులతో పరిచయాలు విస్తృతమౌతాయి. వృత్తి ఉద్యోగాలలో సమస్యలు పరిష్కారమౌతాయి. నూతన కార్యక్రమాలు ప్రారంభానికి శ్రీకారం చుడతారు. ముఖ్యమైన పనులలో ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి.

**వృశ్చికం:** వృత్తి వ్యాపారాలు మందకోడిగా సాగుతాయి. ఉద్యోగస్థులకు అదనపు బాధ్యతల వలన తగిన విశ్రాంతి ఉండదు. కొన్ని పనులలో అధిక శ్రమతో అల్ప ఫలితాన్ని పొందుతారు. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. సోదరులతో స్థిరస్తి వివాదాలు కలుగుతాయి. ఆర్థికంగా ఒడిదుడుకులు తప్పవు.

**ధనస్సు:** కుటుంబ సభ్యులతో ఒక వ్యవహారంలో మాటపట్టింపులు తప్పవు. ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉంటుంది. వ్యాపార ఉద్యోగాలు అంతంత మాత్రంగా సాగుతాయి. దైవ చింతన పెరుగుతుంది. నూతన ఋణ ప్రయత్నాలు చెయ్యవలసి వస్తుంది. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి.

**మకరం:** సమాజంలో ప్రముఖుల నుండి సభ సమావేశాలకు ఆహ్వానాలు అందుతాయి. చేపట్టిన పనులు అనుకున్న సమయానికి పూర్తి చేస్తారు. ఉద్యోగమున పరిస్థితులు అనుకూలిస్తాయి. సన్నిహితుల సహాయంతో కొన్ని వివాదాలు పరిష్కారమౌతాయి. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు.


**కుంభం:** నేత్ర సంబంధిత అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ఇంటా బయట పరిస్థితులు గంధరగోళంగా ఉ ఒటాయి. వృత్తి ఉద్యోగాలలో ఇతరులతో తొందర పడి మాట్లాడటం మంచిది కాదు. బంధు మిత్రుల మాటలు మానసికంగా బాధిస్తాయి. ముక్యమైనా పనులలో శ్రమతో గాని పనులు పూర్తి కావు.

**మీనం:** చిన్ననాటి మిత్రులతో విందు వినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చూడతారు. వ్యాపార ఉద్యోగాలలో ఆశించిన పురోగతి కలుగుతుంది. కుటుంబ వ్యవహారంలో ఆలోచనలను ఆచరణలో పెడతారు. ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి.

# మంత్రులకు వెన్నుపోట్లు!

మొదటి పేజీ తరువాయి

సింగరేణి సంస్థకు చెందిన నైనీ బొగ్గు బావి నుంచి బొగ్గు తవ్వకానికి సంబంధించిన టెండరే మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిపై ఎన్టీవీలో అభ్యంతరకర కథనం ప్రసారానికి కారణమని ఆంధ్రజ్యోతి 'కొత్తపలుకు'లో ఆ సంస్థ ఎండీ రాధాకృష్ణ పేర్కొన్నారు. ఎక్కడో ఒడిశాలో నైనీ బొగ్గు బ్లాక్ వుంటే, తెలంగాణలో గొడవపడ్డారని ఆయన చెప్పుకొచ్చారు. ఒక్కసారి టెండర్ దక్కించుకుంటే 25 ఏళ్ల పాటు పెద్ద మొత్తంలో ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చనేది వ్యూహంగా ఆయన తెలిపారు. దీని కోసం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎన్టీవీ యాజమాన్యం మధ్య వికృత క్రీడ సాగిందని ఆయన వెల్లడించారు. ఈ క్రమంలో మల్లు భట్టి విక్రమార్క, ఎన్టీవీ చానల్ యజమాని నరేంద్ర చౌదరి కలిసి మంత్రి కోమటిరెడ్డిని దారుణంగా బద్నాం చేశారంటూ తనదైన రీతిలో అసాంతం కథనాన్ని రాశారు.




### వైఎస్సార్‌పై కోపంతోనే నాపై వ్యతిరేక కథనం: భట్టి

ఈ కథనంపై డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క తీవ్ర అభ్యంతరం తెలిపారు. 'ఆంధ్రజ్యోతి యజమాని రాధాకృష్ణ కొత్త పలుకు కథనం రాశారు. అందులో రాష్ట్రంలో బొగ్గు గనుల కోసమే కొన్ని వార్తా కథనాలు వండివార్చుతున్నారని రాస్తూ, దాంట్లో నా పేరు కూడా తీసుకొచ్చారు. సింగరేణి బొగ్గు గనుల ఆస్తులు తెలంగాణ ప్రజల ఆత్మ. ఆ ఆస్తుల్ని, ఆత్మని కాపాడి భవిష్యత్ తరాలకు అందించడమే నా ఏకైక లక్ష్యం. రాధాకృష్ణలా ఏది పడితే అది మాట్లాడ్డమో, రాయడమే చేయలేను. ఎందుకంటే, నాకంటూ బాధ్యత, విధానం ఉన్నాయి. రాజకీయాల్లోకి ఒక లక్ష్యం కోసం వచ్చాను. ఆస్తులు సంపాదించడానికో, వ్యాపార సామ్రాజ్యాలు విస్తరించడం కోసమో, అధికారాన్ని హోదాగా అనుభవించడానికో రాలేదు. నా లక్ష్యం ఇక్కడి ఆస్తుల్ని, వనరుల్ని, వ్యవస్థల్ని సమాజంలోని అన్ని వర్గాలకు పంచడమే. దారి దోపిడీగాళ్లు, గద్దల్లాంటి వాళ్లు సమాజంపై పడి పీక్కుతింటుంటే, బాధితుల తరపున మాట్లాడ్డానికి రాజకీయాల్లోకి వచ్చాను. నా జీవితం చాలా పారదర్శకంగా వుంటుంది. ఎవరికో ఉపయోగపడేందుకు నా పాత్ర ఉందని ఆర్కే రాశారు. ఆర్కేను సూటిగా అడుగుతున్నానైటెండర్ పిలిచింది సింగరేణి సంస్థ, ఆ బోర్డు. ఆ టెండర్‌లో షరతుల్ని బోర్డు పెడుతుంది. మంత్రి కాదు. ఆ మాత్రం కూడా జ్ఞానం లేకుండా తోచింది రాయడం కాదు. అలాగే సైట్ విజిట్ అనే షరతును తనకు కావాల్సిన వాళ్లకు టెండర్ ఇచ్చేందుకు పెట్టుకున్నాడని రాశారు. సైట్ విజిట్ అనేది ప్రతి టెండర్‌లో పెడతారని అధికారులు నాకు చెప్పారు. తెలంగాణ ప్రజల్ని మభ్య పెట్టేందుకు ఒక కట్టు కథని, పిట్టకథని అల్లారు. నిజాయతీగా వుండడమే కాదు, ఉన్నట్టు ప్రజలకు కనపడాలి. దాన్నే నమ్ముతున్నాను. టెండర్ రద్దు చేసి, కొత్తగా వెళ్లాలని సింగరేణి బోర్డు, మేనేజ్‌మెంట్‌ను కోరారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏవైతే నిబంధనలున్నాయో, వాటినే అనుసరించాలని నేను కోరాను. అయితే ఇంకా టెండర్‌కు సంబంధించి ఏమీ జరగకుండానే ఏదేదో జరిగిందనడం సరైంది కాదని అధికారులు నాతో చెప్పారు. రాసిన వ్యక్తికి ఎవరిపైనో ప్రేమ ఉండొచ్చు. నేను మొదటి నుంచి కాంగ్రెస్‌లో వైఎస్ రాజశేఖరరెడ్డికి అత్యంత సన్నిహితున్ని. అందుకే వైఎస్సార్‌పై కోపాన్ని నాపై కూడా చూపేందుకే రాసి ఉండొచ్చు. కానీ అనుమానం వచ్చింది కాబట్టి, టెండర్ రద్దు చేయాలని ఆదేశించాను. మిగిలిన విషయాల్లో నేను, రాధాకృష్ణ తేల్చుకుంటాం. ఇది ప్రజలకి సంబంధించింది కాదు. రాధాకృష్ణ రాసిన కట్టు, పిట్ట కథల వెనుక ఎవరున్నారు? ఏ ఉద్దేశంతో రాశారనే విషయాలపై మళ్లీ పూర్తిస్థాయిలో మీడియాతో మాట్లాడుతాను. ఈ బాధ్యతల్లో నేను ఉన్నంత కాలం ఏ గద్దల్ని, దోపిడీదారుల్ని ప్రభుత్వ ఆస్తులపై పడనివ్వను' అని తేల్చి చెప్పారు.




# 'పుర' పోరుకు పచ్చజెండా

మొదటి పేజీ తరువాయి

ఏర్పాట్లు చేసుకోవాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఫిబ్రవరిలో రంజాన్, శివరాత్రి పండుగలు ఉన్నందున ఎన్నికల ప్రక్రియకు ఇబ్బంది లేకుండా ఎన్నికల షెడ్యూల్ రూపొందించుకోవాలని కేబినెట్ అధికారులకు సూచించింది.

### 2027 జూలై 27 నుంచి గోదావరి పుష్కరాలు

గోదావరి పుష్కరాలు పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని గోదావరి పరివాహక ప్రాంతం అభివృద్ధి. బాసర నుంచి భద్రాచలం వరకు రాష్ట్రంలో గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్న అన్ని ప్రధాన ఆలయాలు, పురాతన ఆలయాల అభివృద్ధి, ఎకో టూరిజం అభివృద్ధి చేసేందుకు త్వరలో కేబినెట్ సబ్ కమిటీ వేయాలని నిర్ణయం తీసుకుంది. బాసర నుంచి భద్రాచలం వరకు ఒక సర్క్యూట్ ను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని నిర్ణయం తీసుకుంది. దేవాదాయ, రెవెన్యూ, అటవీ, పర్యాటక, పురాతత్వ శాఖల సంయుక్తంగా డీటేయిల్ రిపోర్ట్ తయారు చేయాలని అధికారులకు కేబినెట్ ఆదేశించింది. మార్చి 31 నాటికి ఒక సమగ్ర ప్రణాళికను రూపొందించాలని సీఎం ఆదేశించారు.

### హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-1 ప్రాజెక్ట్ పై సమీక్ష

హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-1ప్రాజెక్ట్ ను ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకునేందుకు సంబంధించి ఇంతవరకు జరిగిన పురోగతిని కేబినెట్ సమీక్షించింది. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్ణయం తీసుకుంది. మెట్రో ఫేజ్-2ఏలోని నాలుగు కారిడార్లు, ఫేజ్-2బీలోని మూడు కారిడార్ల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం పెండింగ్ లో ఉన్నాయి. ఈలోపు భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. రూ.2,787 కోట్ల అంచనా వ్యయమయ్యే భూ సేకరణ ప్రతిపాదనలను మంత్రివర్గం ఆమోదించింది. మరోవైపు, మహాత్మాగాంధీ యూనివర్సిటీ లా కాలేజీలో 24 కొత్త పోస్టులు, ఫార్మసీ కాలేజీలో 28 కొత్త పోస్టులు మంజూరుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ లో రిజిస్ట్రార్ పోస్టుకు ఆమోదం తెలిపింది. హైదరాబాద్ సమీపంలోని అబ్దుల్లాపూర్ మండలంలో ఎకో టౌన్ డెవలప్మెంట్ కు టీజీఐఐసీకి 494 ఎకరాల భూమిని కేటాయించేందుకు కేబినెట్ అనుమతి ఇచ్చింది. హైదరాబాద్ సిటీలో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు బంజారా హిల్స్ లోని ఐసీసీసీ నుంచి శిల్పా లే అవుట్ రోడ్డు వరకు కొత్తగా 9 కిలోమీటర్ల కొత్త రోడ్డు నిర్మాణానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. ములుగు జిల్లాలో కొత్తగా పొట్లాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ను కేబినెట్ ఆమోదించింది. రామప్ప చెరువు నుంచి నీటిని లిఫ్ట్ చేసి ములుగు జిల్లాలోని 5 గ్రామాలు, 30 చెర్వులు కుంటలను నింపడంతో పాటు.. 7500 ఎకరాల ఆయకట్టు కు నీటిని అందించనుంది. రూ.143 కోట్ల అంచనా వ్యయంతో ఈ స్కీంను చేపట్టనుంది.

# మా మంత్రులను బద్నాం చేయొద్దు: రేవంత్

మొదటి పేజీ తరువాయి

చివరికి ఆ చానెల్ జర్నలిస్టుల అరెస్ట్‌కు దారి తీసింది. మరోవైపు తాజాగా వేమూరి రాధాకృష్ణ తన వీకెండ్ కామెంట్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఎన్టీవీ కథనం వెనుక ఉన్నారంటూ రాయడం చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో ఖమ్మంలో అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. సింగరేణి బొగ్గు మాయమైందని కొన్ని పత్రికలు రాస్తున్నాయని పరోక్షంగా ఆర్కే కథనాన్ని ఆయన ప్రస్తావించారు. సింగరేణి టెండర్లను అనుభవం ఉన్నోళ్లకే ఇస్తామని ఆయన తెలిపారు. ఇందులో అణాపైసా అవినీతికి కూడా చోటు లేదని స్పష్టం చేశారు. మీడియా సంస్థల మధ్య గొడవలుంటే తలుపులు మూసుకుని కొట్టుకోవాలని అన్నారు. తమ మంత్రుల్ని బద్నాం చేయొద్దని కోరారు. తమ మంత్రులపై వార్తలు వస్తే, తన గౌరవానికి భంగం వాటిల్లుతుందని చెప్పుకొచ్చారు. మంత్రులంతా సమన్వయంతో పని చేస్తున్నట్టు పేర్కొన్నారు.

# బాగా తాగేశారేంటండీ..!

మొదటి పేజీ తరువాయి

సగటున రూ. 85 కోట్ల మేరకు మద్యం అమ్మకాలు జరుగుతుంటాయి. అయితే సంక్రాంతి పండుగ సీజన్‌లో ఈ సంఖ్య దాదాపు రెట్టింపు స్థాయికి చేరింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, జిల్లా కేంద్రాల్లో అమ్మకాలు ఎక్కువగా నమోదయ్యాయి. పండుగ వేడుకలు, బంధువుల కలయిక, ఉత్సవాల కారణంగా వినియోగం పెరిగిందని ఎక్సైజ్ శాఖ విశ్లేషించింది. ఎక్సైజ్ శాఖ విడుదల చేసిన అధికారిక గణాంకాల ప్రకారం, సంక్రాంతి వారంలో మద్యం విక్రయాలు ప్రభుత్వానికి భారీ ఆదాయం తీసుకొచ్చాయి.



# బీసీలకు దగా

మొదటి పేజీ తరువాయి

కేటాయించారన్నారు. దీనిపై ప్రతిపక్షాలు ఎందుకు నోరు మెదపడం లేదని కృష్ణయ్య ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లు న్యాయమైన డిమాండ్ అని , న్యాయస్థానంలో కేసు తప్పకుండా గెలుస్తామని కృష్ణయ్య ధీమా వ్యక్తం చేశారు. కేసు కొలిక్కి వచ్చే వరకు మున్సిపల్ ఎన్నికలు వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలోబీసీ నేతలు నీల వెంకటేశ్, అనంతయ్య, రాజేందర్, సతీశ్, రాకేశ్, రాజు నేత తదితరులు పాల్గొన్నారు.

# కోటరీలో బందీ గుర్తించు!

మొదటి పేజీ తరువాయి

మారింది. 'అమ్ముడు పోయిన కోటరీల మధ్య "బందీలుగా ఉన్న ఓ ప్రజా నాయకులారా ఆలోచించుకోండి. భవిష్యత్తులో ఇక్కడ మీకూ ఏం జరగబోతోందో ఇప్పటికైనా గుర్తించండి!. వెనిజువెలాలో ఎంతో భారీగా ప్రజాదరణతో ఎన్నికైన తర్వాత, ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్, ఇంటెలిజెన్స్ అధిపతులు, ఇంతమంది చుట్టూ ఉన్నా, మిసైళ్ళు, యుద్ధ విమానాలు, భారీ సైన్యం ఎంతగా ఉన్నా, ఆ దేశ అధ్యక్షుడిని, అతడి భార్యని ప్రెసిడెన్షియల్ పేలెస్ నుంచి అమెరికా ఎలాంటి ప్రతిఘటనా లేకుండా ఎత్తుకుపోగలిగిందంటే కారణం ఏమిటి? వారంతా అమ్ముడు పోవటమే కదా!' అంటూ విజయసాయిరెడ్డి ట్వీట్ చేశారు. ఈ ట్వీట్‌ను జగన్‌ను ఉద్దేశించే చేశారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రేమఅబశ్రీశ్రీతో కూడిన హెచ్చకగా అభివర్ణిస్తున్నారు.



# రజకుల జాగాలో బ్రాహ్మణ భవనం





**బీసీ కులసంఘాల భవనాలు ఊరు బయట.. బ్రాహ్మణ సంఘ భవనం మాత్రం నడి పట్టణంలో ఆధునాతన దోభీఘాట్‌కు మంగళం పాడినట్లేనా?**

మంథని, జనవరి 18 (ఈవార్తలు): మున్సిపల్ ఎన్నికల వేళ కులసంఘాలకు తాయిలాలిచ్చే కార్యక్రమంలో భాగంగా కుల సంఘ భవనాలకు శంఖుస్థాపనలు చేసిన మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు రజకులకు కేటాయించిన స్థలంలో బ్రాహ్మణ సంఘ భవనానికి శంఖుస్థాపన చేయడం పట్ల విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మంథని పట్టణంలోని పవర్‌హౌజ్ కాలనీలోని ఓవర్‌హెడ్ ట్యాంక్ వద్ద గల ప్రభుత్వ స్థలంలో అధునాతన దోభీఘాట్ నిర్మాణం కోసం రూ. 2 కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులతో సెప్టెంబర్ 21, 2023 రోజున మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో గారితో పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఉన్న పుట్ట మధూకర్ శంఖుస్థాపన చేయించారు. తర్వాత అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో అధునాతన దోభీఘాట్ పనులు నిలిచి పోగా ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా బాధ్యతలు చేపట్టిన దుద్దిల్ల శ్రీధర్‌బాబు ఆ పనులను కొనసాగించడానికి ఆసక్తి చూపించలేదు. దానికి తోడు అప్పటి ప్రభుత్వ ఆనవాళ్లు చెరిపేసే కార్యక్రమంలో భాగంగా అధునాతన దోభీఘాట్ స్థలంలో రూ. 30 లక్షలతో బ్రాహ్మణ సంఘం భవన నిర్మాణం కోసం ఈ నెల 12న శంఖుస్థాపన కోసం శిలాఫలకం వేశారు. అయితే పట్టణంలోని అన్ని కులాలకు సంబంధించిన వారి అవసరాలకు ఉపయోగపడే అధునాతన దోభీఘాట్ అనేది కేవలం ఒక రజకులకే కాక యావత్ పట్టణ ప్రజలకు ఉపయోగపడే నిర్మాణం. అట్టి నిర్మాణాన్ని కొనసాగించాల్సింది పోయి దాని స్థానంలో బ్రాహ్మణ సంఘ భవనం నిర్మించడం ఎంతవరకు సమంజసమని రజకులతో పాటు పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

అసలు విషయానికి వస్తే పూసల, కుమ్మరి, మేర, స్వర్ణకారుల, నాయీ బ్రాహ్మణ మరియు కాపు కుల సంఘ భవనాలకు సైతం ఇదే రోజున మంత్రి శ్రీధర్‌బాబు శిలాఫలకం వేసి శంఖుస్థాపన చేశారు. కానీ బ్రాహ్మణ సంఘానికి మాత్రం అధునాతన దోభీఘాట్‌కు కేటాయించిన స్థలంలో పట్టణం నడిబొడ్డున శంఖుస్థాపన చేసి మిగతా బీసీ కుల సంఘాలను మాత్రం ఊరి బయట బొక్కల వాగు బఫర్ జోన్‌లో మరియు కూచిరాజ్ పల్లి లాంటి పట్టణానికి దూరంగా ఉన్న స్థలంలో శంఖుస్థాపన చేయడాన్ని బట్టి ఆయనకు తన కులం పట్ల ఉన్న అభిమానాన్ని చాటుకున్నారని తేటతెల్లం అవుతోంది. మంథని నడిబొడ్డున ఇప్పటికే శంఖుస్థాపన చేసిన అధునాతన దోభీఘాట్ స్థలం పక్కనే రజక సంఘం భవనానికి శంఖుస్థాపన చేసి దోభీఘాట్ పనులు కూడా పూర్తి చేసినట్లయితే అందరికీ అందుబాటులో ఉండే అవకాశం ఉన్నప్పటికీ అధునాతన దోభీఘాట్ స్థలంలో బ్రాహ్మణ సంఘ భవనానికి శంఖుస్థాపన చేసి రజక సంఘ భవనానికి మాత్రం బోయిన్‌పేట్ చిల్డ్రన్స్ పార్కు వద్ద శిలాఫలకం వేయడం వెనుక ఆంతర్యం ఏంటి? రజకులు నడి పట్టణంలో ఉండకూడదా? అనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. ఇప్పటికైనా రజకులకు కేటాయించిన స్థలంలోనే రజక సంఘం భవనం నిర్మించడంతో పాటు గతంలో మంజూరయిన అధునాతన దోభీఘాట్ పనులను పూర్తి చేయాల్సిన బాధ్యత మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబుపై ఉందని, తక్షణం ఈ దిశగా చర్యలు చేపట్టాలని రజకసంఘం నాయకులతో పాటు స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



# సైక్లింగ్‌తో ఆరోగ్యం

## ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైకిల్స్ కార్యక్రమంలో కిషన్ రెడ్డి

గచ్చిబౌలి/హైదరాబాద్, జనవరి 18 (పీఐబీ): కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాల సహకారంతో జనవరి 18న హైదరాబాద్‌లో నిర్వహించిన 57వ ఎడిషన్ ఫిట్‌నెస్ ఆన్ సండేస్ కార్యక్రమం క్రీడలు, సంస్కృతి, సమాజాన్ని ఒక మరపురాని దృశ్యంగా మిళితం చేస్తూ పండగ వాతావరణాన్ని తలపించింది. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ మార్గదర్శనంలో డిసెంబర్ 2024లో ప్రారంభించిన ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైకిల్ దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమంగా ఎదిగింది. 2 లక్షలకు పైగా ప్రాంతాల్లో 22 లక్షల మంది పౌరుల భాగస్వామ్యాన్ని నమోదు చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ దార్శనికత 'ఫిట్‌నెస్ కా దోస్, ఆధా ఘంటా రోజ్' స్ఫూర్తిగా ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఊబకాయంతో పోరాటం, సుస్థిరమైన, తక్కువ-కార్బన్ గల జీవనశైలిని ప్రోత్సహించడం అనే రెండు జాతీయ ప్రాధాన్యాలను ఈ కార్యక్రమం ముందుకు తీసుకెళ్తుంది. ఆదివారం హైదరాబాద్ శివారు గచ్చిబౌలిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి, బ్యాడ్మింటన్ లెజెండ్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత పుల్లెల గోపీచంద్, అర్జున అవార్డు గ్రహీత, షూటర్ ఈషా సింగ్, పారాలింపిక్ కాంస్య పతక విజేత దీప్తి జీవంజీ సహా అనేక మంది ప్రముఖులు, దిగ్గజ క్రీడాకారులు పాల్గొన్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఐపీఎస్ డాక్టర్ ఎం. రమేష్ రెడ్డితో పాటు ఫిట్‌నెస్ సందేశాన్ని ముందుకు తీసుకుపోయేందుకు సహకరించిన హైదరాబాద్‌కు చెందిన అనేక మంది అథ్లెట్లు, ఫిట్ ఇండియా అంబాసిడర్లు, ఛాంపియన్లు, సైక్లింగ్ మద్దతుదారులను సత్కరించారు. ఈ సందర్భంగా జుంబా, రోప్ స్కిప్పింగ్, యోగా వంటి సరదా ఫిట్‌నెస్ కార్యకలాపాలను ఉత్సాహంగా ఆస్వాదించారు. అలాగే కుడో మార్షల్ ఆర్ట్స్, మల్లఖంబ్ ప్రదర్శనలు కనువిందుగా సాగాయి. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. రోజువారీ జీవితంలో ఫిట్‌నెస్‌ను అనుసంధానించాల్సిన ప్రాముఖ్యాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. సండేస్ ఆన్ సైకిల్స్ వంటి కార్యక్రమాలు ఆరోగ్యకరమైన, మరింత చురుకైన సమాజాన్ని ప్రోత్సహించాలనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికతను ఎలా ప్రతిబింబిస్తున్నదీ వివరించారు.

# ముఖ్యమంత్రివా? ముఠా నాయకుడివా?

## సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఫైర్.. బీఆర్ఎస్ గద్దెలు కూల్చాలన్న వ్యాఖ్యలపై ఆగ్రహం




హైదరాబాద్, జనవరి 18 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విరుచుకుపడ్డారు. బీఆర్ఎస్ జెండా గద్దెలను ధ్వంసం చేయాలంటూ సీఎం మాట్లాడడం ఏంటంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన ముఖ్యమంత్రి, హోంమంత్రి పదవుల్లో ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. 'ముఖ్యమంత్రివా లేక ముఠా నాయకుడివా?' అని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. రాజ్యాంగబద్ధమైన బాధ్యతలను మరిచి, అసాంఘిక చర్యలను ప్రోత్సహించేలా మాట్లాడటం ద్వారా సీఎం తన స్థాయిని దిగజార్చుకున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రజల గుండెల్లో గులాబీ జెండాకు ఉన్న స్థానాన్ని చూసి ముఖ్యమంత్రికి మైండ్ బ్లాక్ అయినట్లుందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రెండేళ్లలోనే కాంగ్రెస్ ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్ అయిందని, తీవ్ర ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందని ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే సీఎంకు మతిభ్రమించిందని, ఆయన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమని అన్నారు. సోషల్ మీడియాలో చిన్న పోస్టు పెడితేనే కేసులు పెట్టి అరెస్టులు చేసే పోలీసు శాఖ, ఇప్పుడు నేరుగా హింసను ప్రేరేపించేలా మాట్లాడిన ముఖ్యమంత్రిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలపై రాష్ట్ర డీజీపీ తక్షణమే స్పందించి, సీఎంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా ఉంటూ రేవంత్ రెడ్డి తెలుగుదేశం పార్టీ పాట పాడటం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని కేటీఆర్ ఆరోపించారు. గత రెండేళ్లుగా తన పాత బాస్ ఆదేశాల మేరకే తెలంగాణ జలహక్కులను కాలరాశారని, నేటి వ్యాఖ్యలతో ఆయన నిజస్వరూపం బట్టబయలైందని అన్నారు. కాంగ్రెస్ మునిగిపోయే నావ అని అర్థం కావడంతోనే, దాని నుంచి బయటకు దూకేందుకు రేవంత్ రంగం సిద్ధం చేసుకుంటున్నారని విమర్శించారు. ఒకవైపు బీజేపీతో చీకటి ఒప్పందాలు, మరోవైపు టీడీపీని రాష్ట్రంపై రుద్దే ప్రయత్నాలను తెలంగాణ సమాజం తిప్పికొడుతుందని హెచ్చరించారు. నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో తెలంగాణకు ద్రోహం చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డి భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని కేటీఆర్ స్పష్టం చేశారు.

# హార్వర్డ్ విద్యార్థిగా రేవంత్ రెడ్డి

- **ప్రత్యేక కోర్సులో చేరిన తెలంగాణ సీఎం**
- **5 రోజుల పాటు లీడర్‌షిప్ ఫర్ ట్వంటీ ఫస్ట్ సెంచరీ కోర్సు**
- **తొలి భారత సిట్టింగ్ సీఎంగా గుర్తింపు**
- **కోర్సు పూర్తయ్యాక హార్వర్డ్ నుంచి సర్టిఫికెట్**

హైదరాబాద్, జనవరి 18 (ఈవార్తలు): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికాలోని ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ యూనివర్సిటీలో విద్యార్థిగా చేరనున్నారు. ఆయన 5 రోజుల పాటు జరిగే ఎగ్జిక్యూటివ్ లీడర్‌షిప్ ప్రోగ్రామ్‌లో పాల్గొనేందుకు తన పేరును నమోదు చేసుకున్నారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో పదవిలో ఉండగా ఒక ముఖ్యమంత్రి ఇలాంటి ఐవీ లీగ్ యూనివర్సిటీలో నాయకత్వ కోర్సు చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం. హార్వర్డ్ కెనెడీ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌లో ఈ నెల 25 నుంచి 30 వరకు ఈ కోర్సు జరగనుంది. 'లీడర్‌షిప్ ఫర్ ది ట్వంటీ ఫస్ట్ సెంచరీ: కేయాస్, కాన్‌ఫ్లిక్ట్, అండ్ కరేజ్' (21వ శతాబ్దపు నాయకత్వం: అరాజకం, సంఘర్షణ, ధైర్యం) పేరుతో ఈ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్నారు. ఈ కోర్సులో భాగంగా తరగతులకు హాజరవడం, అసైన్‌మెంట్లు పూర్తి చేయడం, హోంవర్క్ సమర్పించడం, గ్రూప్ ప్రాజెక్టులలో పాల్గొనడం వంటివి ఉంటాయి. వాస్తవ ప్రపంచంలోని సమస్యలను కేస్ స్టడీస్‌గా తీసుకుని, వాటికి పరిష్కారాలు కనుగొనడంపై ఈ కోర్సులో ప్రధానంగా దృష్టి సారిస్తారు. ఐదు ఖండాలకు చెందిన 20కి పైగా దేశాల నుంచి సీనియర్ నాయకులు, నిపుణులు ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొంటారు. కోర్సు విజయవంతంగా పూర్తి చేసిన తర్వాత రేవంత్ రెడ్డికి హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి సర్టిఫికేషన్ లభిస్తుంది. పదవిలో ఉండగా హార్వర్డ్ సర్టిఫికెట్ అందుకోనున్న తొలి భారత ముఖ్యమంత్రిగా కూడా ఆయన నిలవనున్నారు. ఆధునిక నాయకత్వ విధానాలను అధ్యయనం చేసి, వాటిని తెలంగాణ పాలనలో అమలు చేయాలనే ఉద్దేశంతో రేవంత్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారని తెలుస్తోంది.

# పండుగ వేళ ఆర్టీసీకి మస్తు ఆమ్దానీ

హైదరాబాద్, జనవరి 18 (ఈవార్తలు): సంక్రాంతి పండుగ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు కాసుల వర్షం కురిపించింది. పండుగ సీజన్‌లో ప్రయాణికుల రద్దీని ముందుగానే అంచనా వేసి పక్కా ప్రణాళికతో వ్యవహరించిన ఆర్టీసీ యాజమాన్యం, కేవలం ఐదు రోజుల్లోనే రికార్డు స్థాయిలో ఆదాయం సాధించింది. ఈ నెల 9 నుంచి 13వ తేదీ మధ్య సంస్థకు టికెట్ల విక్రయం ద్వారా ఏకంగా రూ. 67.40 కోట్ల ఆదాయం సమకూరింది. సగటున రోజుకు సుమారు రూ. 13.48 కోట్ల చొప్పున ఆర్జించడం విశేషం. ఈ ఏడాది సంక్రాంతి సెలవులకు తోడుగా వారాంతపు శని, ఆదివారాలు రావడంతో హైదరాబాద్ నుంచి సొంత ఊళ్లకు వెళ్లే ఉద్యోగులు, విద్యార్థులతో బస్సులు కిక్కిరిసిపోయాయి. ఈ రద్దీని తట్టుకునేందుకు టీజీఎస్‌ఆర్టీసీ రాష్ట్రవ్యాప్తంగా 6,431 ప్రత్యేక బస్సులను నడిపింది. సాధారణ రోజులతో పోలిస్తే ఈ స్పెషల్ సర్వీసుల ద్వారానే రోజుకు అదనంగా రూ. 2.70 కోట్ల ఆదాయం వచ్చింది. ప్రైవేటు ట్రావెల్స్ అధిక ఛార్జీలు వసూలు చేస్తాయనే భావన, ఆర్టీసీలో సురక్షిత ప్రయాణం వంటి కారణాలతో ప్రజలు ప్రభుత్వ బస్సులకే మొగ్గు చూపారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణం అమలవుతున్నప్పటికీ, పండుగ సీజన్‌లో పెయిడ్ ప్రయాణికుల సంఖ్య భారీగా పెరగడం సంస్థకు ఆర్థికంగా కలిసొచ్చింది. ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న టీజీఎస్‌ఆర్టీసీకి ఈ ఆదాయం గొప్ప ఊరటనిచ్చింది. పండుగ ముగియడంతో తిరుగు ప్రయాణాల కోసం కూడా ఆర్టీసీ భారీ ఏర్పాట్లు చేసింది. తెలంగాణలోని వివిధ జిల్లాలతో పాటు ఏపీ నుంచి హైదరాబాద్‌కు వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం ప్రధాన కూడళ్లలో పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేసింది. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బస్సుల లభ్యతపై ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నారు. ఈ పండుగ సీజన్‌లో వచ్చిన ఆదాయంతో భవిష్యత్తులో మరిన్ని ఆధునిక బస్సులను ప్రవేశపెట్టేందుకు రవాణా శాఖ యోచిస్తోంది.

# రూ.22 కోసం దోస్త్ దారుణ హత్య




మెదక్, జనవరి 18 (ఈవార్తలు): మెదక్ జిల్లాలో అత్యంత దారుణమైన సంఘటన చోటుచేసుకుంది. కేవలం 22 రూపాయల బాకీ కోసం ఓ వ్యక్తి తన స్నేహితుడిని కిరాతకంగా హత్య చేశాడు. చేగుంట మండలం అనంతసాగర్ గ్రామంలో పండుగ పూట జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. మద్యం మత్తులో విచక్షణ కోల్పోవడం ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. యూపీకి చెందిన మహ్మద్ సిరాజ్, మహేశ్ కుమార్ వర్మ బతుకుదెరువు కోసం అనంతసాగర్ గ్రామంలో నివసిస్తూ కూలీ పనులు చేసుకుంటున్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఇద్దరూ కలిసి మద్యం సేవించారు. ఆ సమయంలో గతంలో సిరాజ్ ఇవ్వాల్సిన రూ.22 బాకీ గురించి మహేశ్ ప్రస్తావించాడు. ఈ చిన్న విషయం కాస్తా ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదానికి దారితీసింది. మద్యం మత్తులో ఉన్న మహేశ్ తీవ్ర ఆగ్రహానికి గురై సిరాజ్‌పై దాడికి పాల్పడ్డాడు. సిరాజ్ తలను సమీపంలోని చెట్టుకు బలంగా కొట్టి, అనంతరం అక్కడే ఉన్న బండరాయితో తలపై మోదాడు. ఈ దాడిలో తలకు తీవ్ర గాయాలైన సిరాజ్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. ఇద్దరూ ప్రాణ స్నేహితుల్లా మెలిగేవారని, ఇంత చిన్న కారణానికి హత్య జరగడం అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసిందని స్థానికులు పేర్కొన్నారు. సమాచారం అందుకున్న చేగుంట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. నిందితుడు మహేశ్ కుమార్ వర్మ తన నేరాన్ని అంగీకరించడంతో అతడిని అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రూ.22 కోసం ఒకరు ప్రాణాలు కోల్పోగా, మరొకరు జైలు పాలు కావడం వారి కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది.

# ఫీజులపై జులుం.. త్వరలో కొత్త జట్టం



హైదరాబాద్, జనవరి 18 (ఈవార్తలు): తెలంగాణలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. సామాన్య తల్లిదండ్రులపై భారం తగ్గించే లక్ష్యంతో రెండేళ్లకు ఒకసారి కేవలం 8 శాతం మాత్రమే ట్యూషన్ ఫీజు పెంచుకునేలా విధివిధానాలు ఖరారు చేసింది. ఈ మేరకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావడానికి కసరత్తు చేస్తోంది. ఈ అంశంపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సుల మేరకు విద్యా కమిషన్ 'తెలంగాణ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్ రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిషన్ ముసాయిదా బిల్లు-2025'ను సిద్ధం చేసింది. పురపాలక ఎన్నికల తర్వాత జరిగే కేబినెట్ సమావేశంలో ఈ బిల్లును ఆమోదించి చట్టబద్ధత కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. నిబంధనల ప్రకారం, 8 శాతం కంటే ఎక్కువ ఫీజు పెంచాలనుకుంటే, ప్రభుత్వం ఏర్పాటు చేసే రాష్ట్రస్థాయి కమిషన్ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి. అయితే, ప్రభుత్వ ప్రతిపాదనను ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఏటా ద్రవ్యోల్బణం 5-6 శాతం పెరుగుతోందని, టీచర్ల జీతాలు, భవనాల అద్దెలు ఏటా పెరుగుతున్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో రెండేళ్లకు ఒకసారి 8 శాతం పెంపు ఏమాత్రం గిట్టుబాటు కాదని స్పష్టం చేస్తున్నాయి. ఉన్నత విద్యా సంస్థల మాదిరిగా పాఠశాలల్లో యాజమాన్య కోటా వంటి అదనపు ఆదాయ మార్గాలు ఉండవని వారు గుర్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇతర రాష్ట్రాల్లో ఉన్నట్లుగా ఏటా ఫీజులు పెంచుకునే అవకాశం కల్పించాలని యాజమాన్యాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ విషయంపై చర్చించేందుకు త్వరలోనే మంత్రివర్గ ఉపసంఘంతో ప్రైవేట్ పాఠశాలల ప్రతినిధులు భేటీ కానున్నారు. అటు తల్లిదండ్రులకు ఉపశమనం, ఇటు విద్యాసంస్థల మనుగడ మధ్య ప్రభుత్వం ఎలాంటి మధ్యేమార్గం కనుగొంటుందనేది ఆసక్తికరంగా మారింది.

# మేడారం స్పెషల్ బస్సుల్లోనూ మహిళలకు ఉచితం

హైదరాబాద్, జనవరి 18 (ఈవార్తలు): మేడారం జాతరకు వెళ్లే మహిళలకు ఆర్టీసీ శుభవార్త చెప్పింది. జాతర సందర్భంగా ఆర్టీసీ స్పెషల్ సర్వీసులు నడపనున్న విషయం తెలిసిందే. ఈ ప్రత్యేక బస్సుల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు శనివారం జాతర స్పెషల్ బస్సులకు టికెట్ ధరలను ఖరారు చేస్తూ ఆర్టీసీ ఓ ప్రకటన విడుదల చేసింది. వరంగల్, హనుమకొండ, హైదరాబాద్ సహా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి మేడారానికి ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు తెలిపింది. వరంగల్, హనుమకొండ నుంచి భక్తులు ఎక్కువ సంఖ్యలో మేడారం జాతరకు వస్తారని అంచనా వేసిన అధికారులు.. అక్కడి నుంచి పెద్ద సంఖ్యలో బస్సులు నడపాలని నిర్ణయించారు. వరంగల్, హనుమకొండ నుంచి మేడారానికి టికెట్ ధర బస్సుల ఆధారంగా రూ.250 నుంచి రూ.500, హైదరాబాద్ నుంచి రూ.600 నుంచి రూ. 1,110 వరకు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ప్రత్యేక బస్సుల్లోనూ మహిళలు, బాలికలు, ట్రాన్స్ జెండర్లకు 'మహాలక్ష్మి' పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు.

# హైదరాబాద్ మెట్రో.. ఇక 6 కోచ్‌లు

హైదరాబాద్, జనవరి 18 (ఈవార్తలు): హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు త్వరలో ఊరట లభించనుంది. నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ప్రయాణికుల రద్దీని నియంత్రించేందుకు హైదరాబాద్ మెట్రో రైలు లిమిటెడ్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఉన్న మూడు కోచ్‌ల రైళ్ల స్థానంలో ఆరు కోచ్‌ల రైళ్లను ప్రవేశపెట్టాలని భావిస్తోంది. ఈ మేరకు తొలి దశలో 10 కొత్త ఆరు కోచ్‌ల రైళ్లను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ప్రస్తుతం రద్దీ సమయాల్లో మూడు కోచ్‌ల రైళ్లలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్తగా ఆరు కోచ్‌ల రైళ్లు అందుబాటులోకి వస్తే, ఒకే ట్రిప్పులో ప్రయాణించే వారి సంఖ్య రెట్టింపు అవుతుంది. దీంతో ప్లాట్‌ఫారమ్‌లపై నిరీక్షణ సమయం తగ్గడమే కాకుండా, ప్రయాణం మరింత సౌకర్యవంతంగా మారుతుంది. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే గ్లోబల్ టెండర్లను పిలిచేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

# హైదరాబాద్ ట్రాఫిక్ పర్యవేక్షణకు యువ ఐపీఎస్‌లు

హైదరాబాద్, జనవరి 18 (ఈవార్తలు): గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, శాంతిభద్రతల బలోపేతంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా, నగరవాసులు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో పలువురు యువ ఐపీఎస్ అధికారులను కీలక స్థానాల్లో నియమించింది. ఈ బదిలీలపై తెలంగాణ డీజీపీ బి. శివధర్ రెడ్డి ఆదివారం మాట్లాడుతూ.. 'నగర పాలనను మెరుగుపరచడం ప్రభుత్వ ప్రాధాన్యతలలో ఒకటి. అందులో భాగంగానే నగరవాసుల ట్రాఫిక్ సమస్యలకు దీర్ఘకాలిక, స్థిరమైన పరిష్కారాలు కనుగొనడమే లక్ష్యంగా ఈ బదిలీలు చేపట్టాం' అని తెలిపారు. క్షేత్రస్థాయిలో మంచి పనితీరు కనబరిచిన యువ, డైనమిక్ ఐపీఎస్ అధికారులకు ట్రాఫిక్ విభాగంలో కీలక బాధ్యతలు అప్పగించినట్లు ఆయన వివరించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టాలని రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని డీజీపీ గుర్తుచేశారు. ఆ దిశగా చర్యలు కొనసాగుతున్నాయని, ఇప్పుడు ట్రాఫిక్ నియంత్రణ, అమలుపై ప్రత్యేకంగా దృష్టి సారించామని ఆయన పేర్కొన్నారు. ఈ బదిలీలతో హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండతో పాటు కొత్తగా ఏర్పాటైన ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ వ్యవస్థను బలోపేతం చేయనున్నారు. కొత్తగూడెం అదనపు ఎస్పీగా పనిచేసిన అవినాశ్ కుమార్‌ను హైదరాబాద్ ట్రాఫిక్-1 డీసీపీగా, ఉట్నూర్ అదనపు ఎస్పీగా ఉన్న కాజల్‌ను ట్రాఫిక్-2 డీసీపీగా నియమించారు. అదేవిధంగా చందన దీప్తిని ఫ్యూచర్ సిటీ అదనపు కమిషనర్‌గా (అడ్మిన్ అండ్ ట్రాఫిక్), అభిషేక్ మహంతిని రాష్ట్రవ్యాప్తంగా అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఐజీగా నియమించారు.





మార్కండేయ జన్మోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 21న నిర్వహించనున్న కార్యక్రమానికి రావాలని ఎమ్మెల్సీ ఎల్ రమణ, జగిత్యాల డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, బీజేపీ సీనియర్ నాయకురాలు భోగ శ్రావణిని ఆహ్వానించిన ముత్యంపేట పద్మశాలీ పెద్దలు. ప్రముఖులను కలిసినవారిలో మల్యాల మండల పద్మశాలి అధ్యక్షుడు ముల్క మల్లయ్య, బాలె శ్రీనివాస్, కొండబత్తిని గంగాధర్, కస్తూరి విశ్వనాథం, గంగమల్లు, ముత్యంపేట పద్మశాలి అధ్యక్షుడు కొండబత్తిని త్రినాథ్, కార్యదర్శి బాలె నవీన్, మార్కండేయ యూత్ అధ్యక్షుడు వేముల మణికంఠ, శివ తదితరులు ఉన్నారు.



## ఆటో స్టాండ్ కోసం స్థలం కేటాయించాలి

**ఎమ్మెల్యే సత్యంకు మల్యాల ఆటోవాలాల విజ్ఞప్తి**

మల్యాల, జనవరి 18 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల ఎక్స్ రోడ్ వద్ద ఉన్న వరద కాలువ ప్రాంతంలో 5 గుంటల స్థలాన్ని కేటాయించాలని మండల ఆటో యూనియన్ సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కలిసి వినతిపత్రం సమర్పించారు. 246 మంది సభ్యులు ఉన్న ఆటో యూనియన్‌కు స్థలం లేక ఆటోలను రోడ్డుకు ఇరువైపులా నిలుపడంతో వచ్చే పోయే వాహనాలకు ఇబ్బందులు తలెత్తి ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయని తెలిపారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో ఉపసర్పంచ్ కట్కం వినయ్, ఆటో యూనియన్ సభ్యులు ఉన్నారు.



## జగిత్యాల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గానికి సన్మానం

జగిత్యాల టౌన్, జనవరి 18 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాకేంద్రంలోని ధన్వంతరి దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జగిత్యాల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని సన్మానించారు. మీడియా ప్రతినిధులను సన్మానించినవారిలో ఆలయ ఫౌండర్, చైర్మన్ వడ్లగట్ల రాజన్న, మేనేజింగ్ ట్రస్ట్ గట్టు రాజేందర్, అధ్యక్షుడు ముత్యాల రాంలింగారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ వొడ్నాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వడ్ల గట్ల శంకర్, సహాయ కార్యదర్శి భారతాల రాజసాగర్, ధర్మకర్తలు పెద్ది శ్రీనివాస్, భారతాల గీత, గుండ శ్రీనివాస్, పూర్ణచందర్ తదితరులు ఉన్నారు.



## తిరుమల కొండకు బండ్ల గణేశ్ పాదయాత్ర

విజయవాడ, జనవరి 18 (ఈవార్తలు): ప్రముఖ నిర్మాత, నటుడు బండ్ల గణేశ్ తిరుమలకు పాదయాత్ర చేపట్టనున్నట్లు వెల్లడించారు. వైసీపీ హయాంలో చంద్రబాబు అరెస్టైన సందర్భంలో శ్రీనివాసుడికి మొక్కుకున్నానని, తాజాగా ఈ మొక్కు చెల్లించుకోవడానికి సంకల్ప యాత్ర చేపడుతున్నానని వివరించారు. 'నా గడప నుంచి నీ కొండ దాకా పాదయాత్ర' చేస్తానని తిరుమల వెంకటేశ్వర స్వామికి మొక్కుకున్నానని ఆయన గుర్తుచేసుకున్నారు. రేపు (సోమవారం) ఉదయం 9 గంటలకు షాద్ నగర్ లోని తన నివాసం నుంచి పాదయాత్ర ప్రారంభిస్తానని చెప్పారు. ఈ సందర్భంగా బండ్ల గణేశ్ మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు. 'దేశం గర్వించే దార్శనికుడు చంద్రబాబుపై అభాండాలు తొలగిపోవాలని.. జైలు నుంచి ఆయన బయటకు రావాలని సుప్రీంకోర్టు గడపపై నిలుచుని శ్రీవేంకటేశ్వరస్వామిని ప్రార్థించా. తిరుమలకు పాదయాత్ర చేస్తానని మొక్కుకున్నా. చంద్రబాబు మళ్లీ పూర్వ వైభవాన్ని సాధించుకున్నారు. ఇటీవలే ఆయనపై కేసులన్నీ కొట్టేశారు. దీంతో నా మనసు కుదుటపడింది. నా కుటుంబం మొక్కు గుర్తుతెచ్చుకుంది. ఇంకా నా గడప నన్ను అడుగుతోంది మొక్కు తీర్చుకోమని. శేషాచలం కొండ పిలుస్తోంది వచ్చి దర్శించుకోమని. అందుకే అమ్మానాన్నల ఆశీర్వాదాలతో షాద్‌నగర్‌లోని మా ఇంటి గడప ముందు కొబ్బరికాయ కొట్టి పాదయాత్ర ప్రారంభిస్తాను. ఆ శ్రీనివాసుని అనుగ్రహంతో కొండకు చేరి దర్శనం చేసుకుంటాను. ఇది రాజకీయ యాత్ర కాదు. నా మనోవేదన తీర్చిన ఆ కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వరస్వామికి నా మొక్కుబడి చెల్లింపు' అని బండ్ల గణేశ్ తెలిపారు.

# పీఎం యువ 3.0 విజేతగా కానుకుర్తి సాయికిరణ్

**జాతీయ స్థాయి సాహితీ వేదికపై తెలుగు తేజం**




న్యూఢిల్లీ/హైదరాబాద్, జనవరి 18 (ఈవార్తలు): అక్షరమే ఆయుధంగా మలచుకుని, సామాజిక అంశమే ఇతివృత్తంగా జాతీయ స్థాయిలో సత్తా చాటారు తెలుగు యువ రచయిత కానుకుర్తి సాయికిరణ్. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'పి.ఎం. యువ3.0' పథకంలో దేశవ్యాప్తంగా ఎంపికైన 43 మంది ప్రతిభావంతులలో ఒకరిగా నిలిచి, తెలుగు సాహితీ కీర్తిని ఢిల్లీ వేదికపై చాటిచెప్పారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆలోచనల నుంచి పుట్టిన 'యువ' పథకం, దేశంలోని 30 ఏళ్ల లోపు యువ రచయితలను ప్రోత్సహించే ఒక గొప్ప వేదిక. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ మరియు నేషనల్ బుక్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించిన ఈ మూడవ విడత పోటీలో వేలాది మంది పోటీ పడ్డారు. వీరిలో తుది జాబితాలో కేవలం 43 మంది మాత్రమే స్థానం సంపాదించుకోగా, తెలుగు భాష తరపున రెండు రాష్ట్రాల నుండి ఎంపికైన ఇద్దరిలో సాయికిరణ్ ఒకరు కావడం గమనార్హం. సాయికిరణ్ తన రచన కోసం 'దేశ నిర్మాణంలో ప్రవాస భారతీయుల సహకారం' అనే ఆసక్తికరమైన అంశాన్ని ఎంచుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది భారతీయులు మాతృభూమి ఆర్థిక వ్యవస్థకు ఎలా వెన్నుముకగా నిలుస్తున్నారో ఆయన తన పుస్తకంలో లోతుగా విశ్లేషించారు. జీ-20 శిఖరాగ్ర సదస్సు జరిగిన ప్రతిష్టాత్మక 'భారత్ మండపం'లో నిర్వహించిన ప్రపంచ పుస్తక ప్రదర్శనలో సాయికిరణ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో పాటు స్పెయిన్, ఖతార్ దేశాల సాంస్కృతిక మంత్రులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ యువ రచయితలతో ముఖాముఖీగా మాట్లాడి, దేశ యువతను ప్రేరేపించేలా రచనలు చేయాలని పిలుపునిచ్చారు. రచయితలకు అవసరమైన పరిశోధన సామగ్రిని ఎన్బీటీ ద్వారా అందించాలని, 'వన్ నేషన్ వన్ సబ్‌స్క్రిప్షన్' సౌకర్యాన్ని కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి వినీత్ జోషి, ఎన్బీటీ డైరెక్టర్ యువరాజ్ మాలిక్ తదితరులు పాల్గొన్నారు. ఈ పథకం కింద ఎంపికైన సాయికిరణ్ రచనను నేషనల్ బుక్ ట్రస్ట్ స్వయంగా ప్రచురించనుంది. ఈ పుస్తకం దేశంలోని అన్ని ప్రధాన భాషల్లోకి అనువదించబడి, జాతీయ స్థాయి గ్రంథాలయాల్లో అందుబాటులోకి రానుంది. దీనితో పాటు, కేంద్ర ప్రభుత్వం ఆయనకు ప్రత్యేక మెంటార్‌షిప్ స్కాలర్‌షిప్, రాయల్టీని కూడా అందజేయనుంది. కాగా, సాయికిరణ్ సాధించిన ఈ విజయం తెలుగు రాష్ట్రాలకు, మాతృభాషకు గర్వకారణమని సాహితీ మిత్రులు, ప్రముఖులు అభినందనలు తెలిపారు.

# దుబాయ్‌లో ఘనంగా ఎన్టీఆర్ 30వ వర్ధంతి

**తెలుగువాళ్ల ఆత్మగౌరవాన్ని నిలిపారని కొనియాడిన వక్తలు**



దుబాయ్: తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహానటుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) 30వ వర్ధంతి కార్యక్రమాన్ని దుబాయ్‌లోని ఎన్నారై తెలుగుదేశం పార్టీ (టీడీపీ) విభాగం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించింది. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, సభ్యులందరూ పుష్పాంజలి ఘటించి ఆయనకు ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎన్నారై టీడీపీ నాయకులు మాట్లాడుతూ, ఎన్టీఆర్ భౌతికంగా దూరమైనా ఆయన ఆశయాలు, జ్ఞాపకాలు తెలుగు ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచి ఉంటాయని అన్నారు. ఒకవైపు వెండితెరపై అద్వితీయమైన నటనతో కోట్లాది మంది అభిమానాన్ని చూరగొని, మరోవైపు రాజకీయాల్లోనూ తనదైన ముద్ర వేసి తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన యుగపురుషుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. ఆయన పాలనలో ప్రవేశపెట్టిన పథకాలు దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలకు స్ఫూర్తినిచ్చాయని గుర్తుచేసుకున్నారు. ముఖ్యంగా సమాజంలోని పేద వర్గాల సంక్షేమానికి ఎన్టీఆర్ పెద్దపీట వేశారని వక్తలు పేర్కొన్నారు. రెండు రూపాయలకే కిలో బియ్యం వంటి పథకాలతో పేదల ఆకలి తీర్చిన ఆయన దార్శనికత చిరస్మరణీయమని అన్నారు. మహిళల అభ్యున్నతి, గ్రామీణాభివృద్ధి కోసం ఆయన అమలు చేసిన విధానాలు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడ్డాయని ప్రశంసించారు. ఆయన చూపిన మార్గంలో పయనిస్తూ, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి తెలుగువాడి బాధ్యత అని ఉద్ఘాటించారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో ప్రజాసేవకు పునరంకితం కావాలని ఈ సందర్భంగా సభ్యులందరూ సంకల్పం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దుబాయ్‌లో నివసిస్తున్న పలువురు ఎన్నారై టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రియతమ నేతకు శ్రద్ధాంజలి ఘటించారు.



# విజయవాడ-హైదరాబాద్ హైవేపై భారీగా రద్దీ

పంతంగి, జనవరి 18 (ఈవార్తలు): సొంత గ్రామాల్లో సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకున్న ప్రజలు తిరుగు ప్రయాణాలు ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో హైదరాబాద్‌కు బయలుదేరడంతో ప్రధాన నగరాల బస్ స్టేషన్లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్ కాంప్లెక్స్‌లలో భారీ రద్దీ నెలకొంది. ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా ఉన్న మార్గాల్లో ఏపీఎస్‌ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. ప్రత్యేక బస్సుల్లో కూడా సాధారణ ఛార్జీలే వసూలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో ప్రయాణికులు ఆర్టీసీ సేవలను ఎక్కువగా వినియోగించుకుంటున్నారు. మరోవైపు పల్లెల నుంచి నగరాల వైపు ప్రజలు భారీగా కార్లలో పయనమవ్వడంతో విజయవాడ - హైదరాబాద్ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ పెరిగింది. ఎన్టీఆర్ జిల్లా నందిగామ వై - జంక్షన్ వద్ద ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. సర్వీస్ రోడ్లకు మరమ్మతులు చేపట్టి, తాత్కాలిక రహదారులు ఏర్పాటు చేయడంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలు సాఫీగా సాగుతున్నాయి. అయితే ఎన్‌హెచ్ - 65పై చిట్యాల, పెద్దకాపర్తి, చౌటుప్పల్ ప్రధాన కూడళ్లలో వాహనాలు బారులు తీరాయి. శనివారం రాత్రి కొర్లపహాడ్, పంతంగి టోల్ ప్లాజాల వద్ద వాహనాలు నెమ్మదిగా కదిలాయి. టోల్ గేట్లు, కీలక ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను పోలీసులు క్రమబద్ధీకరిస్తున్నారు. నల్గొండ జిల్లా చిట్యాల వద్ద రద్దీ మరింత ఎక్కువగా కనిపించింది. వేల సంఖ్యలో కార్లు, ఇతర వాహనాలు బారులు తీరడంతో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు పోలీసులు వాహనాలను చిట్యాల నుంచి కుడివైపు సింగిల్ రోడ్డులో భువనగిరి మీదుగా హైదరాబాద్ వైపుకు మళ్లించారు. వాహనాల సంఖ్య పెరిగినా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు డ్రోన్ కెమెరాలు, సీసీటీవీల సహాయంతో ట్రాఫిక్ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

## ఏపీ సమాచార కమిషన్‌కు కొత్త సారథులు

**చీఫ్ కమిషనర్‌గా వజ్జా శ్రీనివాసరావు నియామకం**

విజయవాడ, జనవరి 18 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార హక్కు (ఆర్‌టీఐ) కమిషన్‌కు ప్రభుత్వం కొత్త సారథులను నియమించింది. ప్రధాన సమాచార కమిషనర్‌గా (సీఐసీ) ప్రముఖ న్యాయవాది వజ్జా శ్రీనివాసరావును ఎంపిక చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ నేడు ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీనివాసరావుతో పాటు మరో నలుగురిని సమాచార కమిషనర్లుగా నియమించారు. వీరిలో వి. శరత్ చంద్ర కల్యాణ చక్రవర్తి, గాజుల ఆదెన్న (అనంతపురం), ఒంటేరు రవిబాబు (కడప), పరవాడ సింహాచలం నాయుడు (విశాఖపట్నం) ఉన్నారు. నియమితులైన వారంతా న్యాయవాద వృత్తికి చెందిన వారు కావడం గమనార్హం. ఈ కొత్త కమిషనర్లు మూడేళ్ల పాటు లేదా వారికి 65 ఏళ్లు వచ్చే వరకు (ఏది ముందైతే అది) పదవిలో కొనసాగుతారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన, మంత్రులతో కూడిన సెలెక్షన్ కమిటీ చేసిన సిఫార్సులకు గవర్నర్ ఆమోదం తెలపడంతో ప్రభుత్వం ఈ నియామకాలను ఖరారు చేస్తూ గెజిట్ విడుదల చేసింది. ప్రస్తుతం కమిషన్‌లో ముగ్గురు సభ్యులు ఉండగా, తాజా నియామకంతో కమిషన్ బలం గణనీయంగా పెరిగింది. ఈ నియామకాలతో సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తుల పరిష్కారం వేగవంతం అవుతుందని, ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత మరింత పెరుగుతుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

## ఆలయానికి రూ. కోటి స్థలం విరాళం

**జీఎంఆర్ అధినేత దాతృత్వం**

విజయనగరం, జనవరి 18 (ఈవార్తలు): ప్రముఖ వ్యాపారవేత్త, జీఎంఆర్ గ్రూప్ అధినేత గ్రంధి మల్లికార్జునరావు తన సొంత జిల్లాలో భారీ విరాళం ప్రకటించారు. విజయనగరం జిల్లా రాజాంలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయానికి రూ. కోటి విలువైన 19 సెంట్ల స్థలాన్ని వితరణగా అందించారు. శనివారం తన భార్య వరలక్ష్మితో కలిసి ఆలయాన్ని సందర్శించిన ఆయన, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థలానికి సంబంధించిన దస్తావేజులను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ పర్యటనలో భాగంగా జీఎంఆర్ సంస్థ నిర్మిస్తున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనుల పురోగతిని మల్లికార్జునరావు సమీక్షించారు. టెర్మినల్ భవనం, రన్‌వే, ప్రయాణికుల సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించి, పనుల నాణ్యతపై అధికారులతో చర్చించారు. వ్యాపార కార్యకలాపాలతో పాటు జీఎంఆర్ గ్రూప్ సేవా కార్యక్రమాల్లోనూ ముందుంటుంది. ప్రతి ఏటా సంక్రాంతికి తన స్వస్థలానికి వచ్చే మల్లికార్జునరావు, ఈసారి కూడా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. పండుగ సందర్భంగా సుమారు 8 వేల మందికి రూ. 64 లక్షల విలువైన వస్త్రాలను పంపిణీ చేశారు. దీంతో పాటు జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ద్వారా రాజాం ప్రాంతానికి చెందిన 40 మంది నిరుపేద బాలలను దత్తత తీసుకున్నారు. ఈ విద్యార్థుల చదువుకు అయ్యే పూర్తి ఖర్చును ఫౌండేషన్ భరిస్తుందని ఆయన తెలిపారు.

# ట్రంప్ మోసం చేశాడు!

## ఇరాన్ నిరసనకారుల తీవ్ర ఆగ్రహం.. బలిపశువులను చేశారంటూ మండిపాటు

టెహ్రాన్: ఇరాన్‌లో జరిగిన ప్రభుత్వ వ్యతిరేక నిరసనల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమను నమ్మించి మోసం చేశాడని, ద్రోహానికి పాల్పడ్డాడని అక్కడి ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ట్రంప్ ఇచ్చిన హామీలను నమ్మి తాము రోడ్లపైకి వస్తే, ఆయన తమను ఫూల్స్ ని చేశాడని, మాట మార్చి తమను నట్టేట ముంచాడని ఆవేదన చెందుతున్నారు. ఇరాన్‌లో ఆర్థిక సమస్యలపై మొదలైన ఆందోళనలు ప్రభుత్వ మార్పు డిమాండ్‌తో ఉధృతంగా మారినప్పుడు, ట్రంప్ సోషల్ మీడియా వేదికగా నిరసనకారులకు మద్దతు ప్రకటించారు. "త్వరలోనే సహాయం అందుతుంది" అని, శాంతియుత నిరసనకారులపై హింసకు పాల్పడితే అమెరికా చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. దీంతో అమెరికా సైనిక చర్య తీసుకుంటుందనే ఆశతో చాలామంది నిరసనల్లో పాల్గొన్నారు. అయితే, ఇరాన్ ప్రభుత్వం ఈ నిరసనలను ఉక్కుపాదంతో అణచివేసింది. స్నైపర్ ఫైరింగ్, మెషీన్ గన్లతో జరిపిన దాడుల్లో వేలాది మంది ప్రాణాలు కోల్పోయారని (దాదాపు 15,000 మంది మరణించారని అంచనా) నివేదికలు వచ్చాయి. అయితే, ట్రంప్ తన వైఖరిని మార్చుకుని, ఇరాన్ ప్రభుత్వం హత్యలు ఆపేస్తామని



హామీ ఇచ్చిందని, సైనిక చర్య ఉండదని ప్రకటించారు. ఈ పరిణామంతో నిరసనకారులు తీవ్ర నిరాశకు లోనయ్యారు. ట్రంప్ చర్యలపై టైమ్ పత్రికతో పలువురు ఇరానియన్లు తమ ఆవేదనను పంచుకున్నారు. "ఈ 15,000 మరణాలకు ట్రంపే బాధ్యుడు. ఆయన పోస్టులు చూసే చాలామంది రోడ్లపైకి వచ్చారు" అని టెహ్రాన్‌కు చెందిన ఓ వ్యాపారవేత్త అన్నారు. "ట్రంప్ మమ్మల్ని యుద్ధంలో బలిపశువులుగా వాడుకున్నారు. మా కాళ్ల కింద నుంచి నేల లాగేశారు" అని మరికొందరు ఆరోపించారు. వాస్తవానికి, దేశంలో కరెన్సీ విలువ పడిపోవడం, ధరల పెరుగుదల వంటి ఆర్థిక



సమస్యలతో ఈ నిరసనలు మొదలయ్యాయి. అయితే, ఇవి క్రమంగా ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలుగా మారాయి. ఇరాన్ అధికారులు మాత్రం ఈ నిరసనలను అమెరికా కుట్రగా అభివర్ణిస్తున్నారు. ట్రంప్ తీరుతో ఇరాన్ ప్రజల్లో ఆయనపై తీవ్ర అపనమ్మకం నెలకొంది.



## మణికర్ణిక ఘాట్‌పై ఫేక్ ఏఐ చిత్రాలు

**కాంగ్రెస్, ఆప్ నేతలతో సహా 8 మందిపై కేసు**

వారణాసి: ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో ఉన్న ప్రఖ్యాత మణికర్ణిక ఘాట్ అభివృద్ధి పనులకు సంబంధించి సోషల్ మీడియాలో కృత్రిమ మేధతో సృష్టించిన ఫేక్ చిత్రాలు, తప్పుడు ప్రచారం చేసినందుకు 8 మందిపై పోలీసులు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. మణికర్ణిక ఘాట్‌లో జరుగుతున్న సుందరీకరణ పనులకు సంబంధించి వాస్తవాలకు విరుద్ధంగా, కల్పిత చిత్రాలను ఎక్స్ (ట్విట్టర్) వేదికగా కొందరు ప్రచారం చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ చిత్రాలలో హిందూ దేవతలను అవమానకరంగా చూపించారని, తద్వారా మత విశ్వాసాలను దెబ్బతీసి, ప్రజల్లో ఆగ్రహం రెచ్చగొట్టేందుకు, సామాజిక సామరస్యాన్ని దెబ్బతీయడానికి ప్రయత్నించారని అధికారులు ఆరోపించారు. ఈ విషయంపై ఏసీపీ అతుల్ అంజన్ మాట్లాడుతూ.. "మణికర్ణిక ఘాట్‌లో జరుగుతున్న పనులకు సంబంధించి అనేక తప్పుడు పోస్టులు, చిత్రాలు సర్క్యులేట్ అయ్యాయి. భవిష్యత్తులో ఇలాంటివి పోస్ట్ చేసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం" అని హెచ్చరించారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసిన వారిలో కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన నేతలు కూడా ఉన్నారని ఆయన వెల్లడించారు. ఘాట్‌లో అభివృద్ధి పనులు చేపడుతున్న సంస్థ ప్రతినిధి చౌక్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 2025 నవంబర్ 15 నుంచి తాము పనులు చేస్తున్నామని, జనవరి 16న రాత్రి ఒక ఎక్స్ యూజర్ ఏఐ-జనరేటెడ్ చిత్రాలను షేర్ చేసి, ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ పోస్టులకు అభ్యంతరకరమైన కామెంట్లు, రీపోస్టులు రావడంతో ఉద్రిక్తతలు పెరిగాయని పోలీసులు గుర్తించారు. వదంతులు వ్యాప్తి చేసేవారిపై చర్యలు కొనసాగుతాయని, పోస్టులు పెట్టిన వారితో పాటు వాటిని రీపోస్ట్ చేసి, కామెంట్లు చేసిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని అధికారులు స్పష్టం చేశారు.




## హిందూయేతరులకు ప్రవేశం లేదు

**హరిద్వార్‌లో వెలసిన బోర్డులు**

హరిద్వార్: ప్రముఖ పుణ్యక్షేత్రం హరిద్వార్‌లోని హర్ కీ పౌరీ వద్ద హిందూయేతరుల ప్రవేశాన్ని నిషేధిస్తూ బోర్డులు ఏర్పాటు చేయడం చర్చనీయాంశమైంది. ఘాట్‌ల నిర్వహణ చూసే శ్రీ గంగాసభ ఈ చర్య తీసుకుంది. హర్ కీ పౌరీకి వెళ్లే అన్ని ప్రవేశ మార్గాల వద్ద, వంతెనల రెయిలింగ్‌లు, స్తంభాలపై "అహిందూ ప్రవేశ్ నిషేధ్ క్షేత్ర" (హిందూయేతరులకు ప్రవేశం నిషేధించబడిన ప్రాంతం) అని రాసి ఉన్న ఎరుపు రంగు బోర్డులను శుక్రవారం ఏర్పాటు చేసింది. ఈ ప్రాంతం పవిత్రతను కాపాడటానికే ఈ నిర్ణయం తీసుకున్నామని గంగాసభ అధ్యక్షుడు నితిన్ గౌతమ్ తెలిపారు. బ్రిటిష్ కాలం నాటి 1916 హరిద్వార్ మున్సిపల్ కార్పొరేషన్ చట్టాన్ని తాము అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ చట్టం ప్రకారం హర్ కీ పౌరీ ప్రాంతంలో హిందూయేతరులు ప్రవేశించడం, నివసించడం, ఆస్తులు కొనడం వంటివి నిషిద్ధమని పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో కొందరు హిందూయేతరులు సనాతన ధర్మ విశ్వాసాలను దెబ్బతీసేలా ప్రవర్తిస్తున్నారని, అందుకే ఈ నిబంధనలను కఠినంగా అమలు చేయాల్సి వస్తోందని అన్నారు. కొద్ది రోజుల క్రితం ఇద్దరు యువకులు అరబ్ షేక్‌ల వేషధారణలో ఇక్కడ వీడియో తీయడం కూడా ఈ నిర్ణయానికి ఒక కారణంగా తెలుస్తోంది. ఈ విషయంపై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి స్పందించారు. గంగాసభ ప్రతినిధులు, ఇతర మత పెద్దలతో చర్చిస్తున్నామని, అన్ని చట్టాలు, నిబంధనలను సమీక్షించిన తర్వాత ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటుందని ఆయన తెలిపారు. అయితే, జిల్లా యంత్రాంగం గానీ, మున్సిపల్ అధికారులు గానీ ఈ విషయంలో ఎటువంటి తాజా ఉత్తర్వులు జారీ చేయలేదని, ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నామని స్పష్టం చేశారు. రాబోయే 2027 అర్ధ కుంభమేళా నాటికి హరిద్వార్‌లోని 105 ఘాట్‌లలో ఈ నిషేధాన్ని అమలు చేయాలని గంగాసభ ప్రభుత్వాన్ని కోరుతోంది.



# అమృత్ రైళ్లలో ఆర్ఏసీ రద్దు

**సెకండ్ క్లాస్‌లో కనీస ఛార్జీ రూ.36**

న్యూఢిల్లీ: సామాన్య, మధ్యతరగతి ప్రయాణికుల కోసం ప్రవేశపెట్టిన అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల విషయంలో భారతీయ రైల్వే కీలక మార్పులు చేసింది. ఈ నెలలో పట్టాలెక్కనున్న కొత్త "అమృత్ భారత్ ××" రైళ్లలో టికెటింగ్ నిబంధనలను సవరించింది. ఇందులో భాగంగా, స్లీపర్ క్లాస్‌లో రిజర్వేషన్ ఎగైనెస్ట్ క్యాన్సిలేషన్ విధానాన్ని పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఇకపై ప్రయాణికులకు కేవలం కన్ఫర్మ్ బెర్తులు మాత్రమే కేటాయిస్తారు. కొత్త నిబంధనల ప్రకారం, అమృత్ భారత్ ×× రైళ్లలో కనీస ప్రయాణ దూరానికి ఛార్జీల విధానాన్ని కూడా రైల్వే బోర్డు మార్చింది. సెకండ్ క్లాస్‌లో కనీసం 50 కిలోమీటర్ల దూరానికి ఛార్జీ చెల్లించాల్సి ఉంటుంది. దీనికి కనీస బేస్ ఫేర్ రూ.36గా నిర్ణయించారు. అదేవిధంగా, స్లీపర్ క్లాస్‌లో కనీస ఛార్జీ దూరాన్ని 200 కిలోమీటర్లుగా నిర్ధారించారు. దీనికి కనీస బేస్ ఫేర్ రూ.149గా ఉంటుంది. ప్రయాణ దూరం ఇంతకంటే తక్కువగా ఉన్నప్పటికీ, ఈ కనీస ఛార్జీని తప్పనిసరిగా చెల్లించాల్సి ఉంటుంది. ప్రయాణికులకు ఆర్ఏసీ బెర్తులపై ఉండే అనిశ్చితిని తొలగించి, బుకింగ్ ప్రారంభం నుంచే కన్ఫర్మ్ బెర్తులను అందించాలనే లక్ష్యంతో ఈ మార్పులు చేసినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. ఈ బేస్ ఫేర్‌కు రిజర్వేషన్ ఛార్జీ, సూపర్‌ఫాస్ట్ సర్‌ఛార్జీ వంటి ఇతర రుసుములు అదనంగా ఉంటాయని రైల్వే బోర్డు తన ఆదేశాల్లో స్పష్టం చేసింది. ఈ మార్పులకు అనుగుణంగా సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ తన సాఫ్ట్‌వేర్‌లో అవసరమైన మార్పులు చేయనుంది. పుష్-పుల్ టెక్నాలజీతో నడిచే ఈ రైళ్లు తక్కువ ప్రయాణ సమయంలో గమ్యస్థానాలకు చేర్చడమే కాకుండా, మెరుగైన సౌకర్యాలను అందిస్తాయి.

# విజయ్‌కు మరోసారి సీబీఐ సమన్లు

**నేడు ఢిల్లీలో విచారణకు హాజరు కావాలని ఆదేశం**

చెన్నై/ఢిల్లీ: తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత, నటుడు విజయ్‌కు కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) మరోసారి సమన్లు జారీ చేసింది. కరూర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించిన కేసు విచారణలో భాగంగా సోమవారం ఢిల్లీలోని తమ కార్యాలయంలో హాజరు కావాలని ఆదేశించింది. ఈ మేరకు విజయ్ ఈ సాయంత్రం ఢిల్లీకి బయలుదేరనున్నట్లు తెలుస్తోంది. 2025 సెప్టెంబర్ 27న కరూర్‌లో విజయ్ నిర్వహించిన రాజకీయ ప్రచార కార్యక్రమంలో భారీగా జనం తరలిరావడంతో తొక్కిసలాట జరిగింది. ఈ దుర్ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన తమిళనాడు వ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించడంతో దర్యాప్తు బాధ్యతను సీబీఐ చేపట్టింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి



జస్టిస్ అజయ్ రస్తోగి నేతృత్వంలోని కమిటీ ఈ విచారణను పర్యవేక్షిస్తోంది. ఈ కేసులో భాగంగా సీబీఐ ఇప్పటికే టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్, ఎన్నికల నిర్వహణ విభాగం ప్రధాన కార్యదర్శి అధవ్ అర్జున, సంయుక్త ప్రధాన కార్యదర్శి నిర్మల్ కుమార్, కరూర్ జిల్లా కార్యదర్శి మదియళగన్ వంటి పలువురు ముఖ్య నేతలను విచారించింది. వారిచ్చిన సమాచారం ఆధారంగా విజయ్‌ను ప్రశ్నించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే ఈ నెలఅబశ్రీశ్రీ 12న విజయ్ తొలిసారి ఢిల్లీలో సీబీఐ ఎదుట హాజరయ్యారు. ఆ రోజు అధికారులు ఆయన్ను సుదీర్ఘంగా ప్రశ్నించారు. కరూర్ సభ ఏర్పాట్లు ఎవరు చేశారు, భద్రతా చర్యలపై ముందస్తు సమాచారం ఉందా, సభాస్థలికి ఎందుకు ఆలస్యంగా వచ్చారు వంటి కీలక ప్రశ్నలు అడిగినట్లు సమాచారం. పొంగల్ పండుగ తర్వాత మరోసారి నోటీసులు జారీ చేసి, రెండో దశ విచారణకు పిలిచారు. ఈ ఘటనలో బాధ్యులను గుర్తించే పనిలో దర్యాప్తు సంస్థ వేగం పెంచింది.




## గడ్డకట్టే చలిలో గ్రీన్‌లాండ్ వాసుల నిరసన

లండన్: గ్రీన్ లాండ్ ను ఏదేమైనా సరే స్వాధీనం చేసుకుని తీరతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిని వ్యతిరేకించే దేశాలపై టారిఫ్ లు విధిస్తానని హెచ్చరించిన ట్రంప్.. అన్నట్టుగానే ఈయూలోని 8 దేశాలపై 10 శాతం టారిఫ్ విధిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పరిణామాలపై గ్రీన్ లాండ్ లో నిరసనలు వెల్లువెత్తాయి. శనివారం గ్రీన్ లాండ్ రాజధాని నగరం నూక్ లో వేలాదిమంది జనం ఆందోళన చేశారు. గడ్డకట్టించే చలిలో జాతీయ పతాకాలను చేతబట్టి ట్రంప్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రధాని జెన్స్ ఫ్రెడరిక్ నీల్సన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన ర్యాలీలో 'గ్రీన్ లాండ్ అమ్మకానికి లేదు' అంటూ నినాదాలతో జనం హోరెత్తించారు. తమ సంస్కృతిని, స్వయం ప్రతిపత్తిని కాపాడుకుంటామని గ్రీన్ లాండ్ వాసులు స్పష్టం చేశారు. తమకు అనుకూలంగా గళమెత్తిన ఈయూ దేశాలపై టారిఫ్ లు విధించడాన్ని తప్పుబట్టారు. నూక్ జనాభాలో దాదాపు నాలుగో వంతు జనం ఈ నిరసన ర్యాలీలో పాల్గొన్నారు. నిరసనకారులు తమ పిల్లలను కూడా ఈ ఆందోళనకు వెంట తీసుకువచ్చారు. తమ దేశాన్ని కాపాడుకోవడం, ప్రపంచానికి తమ గొంతు వినిపించడం రేపటి తరానికి తెలియాలనే ఉద్దేశంతో పిల్లలను కూడా నిరసనలకు తీసుకొచ్చామని వారు తెలిపారు. కాగా, గ్రీన్ లాండ్ లో ఇప్పటి వరకు జరిగిన నిరసనల్లో ఇదే అతిపెద్దదని స్థానిక పోలీసులు వెల్లడించారు.





## అక్రమ వలసదారులతో కాంగ్రెస్ దోస్తీ

హస్తం పార్టీపై ప్రధాని మోదీ మండిపాటు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ ప్రతికూల రాజకీయాలను దేశ ప్రజలు తిరస్కరిస్తున్నారని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీకి ప్రజల్లో మద్దతు పెరుగుతోందని చెప్పారు. ప్రజల మొదటి ఎంపికగా తమ పార్టీ మారిందని తెలిపారు. ఓటర్లు సుపరిపాలన, అభివృద్ధిని కోరుకుంటున్నారని, బీహార్ ఎన్నికలు.. తిరువనంతపురం, ముంబయి స్థానిక ఎన్నికల్లో ఈ విషయం స్పష్టమయ్యిందని చెప్పారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న అస్సాంలో ఇవాళ ప్రధాని మోదీ పర్యటించారు. కలియాబోర్ ప్రాంతంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. దేశాన్ని ఎన్నో ఏళ్లు పాలించినప్పటికీ కాంగ్రెస్‌కు అభివృద్ధి అజెండా లేదని, అందువల్లే ఆ పార్టీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని అన్నారు. కాంగ్రెస్ తన రాజకీయాల కోసం భారత వ్యతిరేక భావజాలం ఉన్న వ్యక్తులతో జట్టు కట్టిందని ఆరోపించారు. చొరబాటుదారుల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం కోసం ఎన్నో ఏళ్లు కాంగ్రెస్ పార్టీ అస్సాంలో వారికి ఆశ్రయమిచ్చిందని ప్రధాని చెప్పారు. ఆ పార్టీ హయాంలో పెద్ద మొత్తంలో చొరబాటుదారులు రాష్ట్రంలోకి వచ్చారని అన్నారు. కాంగ్రెస్ పెంచి, పోషించిన అక్రమ వలసదారులు ప్రజల భూములు ఆక్రమించుకుంటున్నారని చెప్పారు. వారి సంస్కృతిపై దాడి చేస్తున్నారని అన్నారు. దీనివల్ల అస్సాం ప్రజల అస్తిత్వం ప్రమాదంలో పడిందని ప్రధాని చెప్పారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలో ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి మరిన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ట్రంప్‌కు వ్యతిరేకంగా ఈయూ ఎమర్జెన్సీ మీటింగ్

లండన్: గ్రీన్ లాండ్ ను అమెరికాలో కలిపేసుకోవాలన్న తన అభీష్టాన్ని వ్యతిరేకిస్తున్నాయని ఈయూ కూటమిలోని 8 దేశాలపై డొనాల్డ్ ట్రంప్ తాజాగా 10 శాతం టారిఫ్ లు విధించారు. అయితే, ఈ నిర్ణయాన్ని ఈయూ చీఫ్ లు తప్పుబట్టారు. ట్రంప్ బెదిరింపు సుంకాలపై తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. తాజా పరిణామాల నేపథ్యంలో యురోపియన్ యూనియన్ (ఈయూ) దేశాల



అత్యవసర భేటీకి పిలుపునిచ్చారు. ఈ మేరకు యురోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాండెర్ లాన్, యురోపియన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ ఆంటోనియో కోస్టా సంయుక్తంగా ఓ ప్రకటన జారీ చేశారు. ట్రంప్ ప్రతిపాదిత సుంకాలు సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న ఈయూ-- యూఎస్ సంబంధాలకు తీవ్ర విఘాతం కలిగిస్తాయని ఇందులో వారు హెచ్చరించారు. పరస్పర సహకారం తప్పనిసరిగా మారిన పరిస్థితుల్లో ఈ ధోరణి ఇరువైపులా నష్టం చేకూరుస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రంప్ సుంకాలు ట్రాన్స్ అట్లాంటిక్ సంబంధాలను దెబ్బతీస్తాయని, వాణిజ్య అడ్డంకులకు ఊతమిస్తాయని చెప్పారు. 'యూరప్ ఐక్యంగా, సమన్వయంతో మరియు దాని సార్వభౌమత్వాన్ని నిలబెట్టుకోవడానికి కట్టుబడి ఉంటుంది' అంటూ ఈయూ చీఫ్ లు ట్వీట్ చేశారు. మిత్రదేశాలతో కలిసి డెన్మార్క్ ఇటీవల గ్రీన్‌ల్యాండ్‌లో నిర్వహించిన సైనిక విన్యాసాలను కూడా వారు సమర్థించారు. ఆర్కిటిక్ ప్రాంతంలో భద్రతను పెంచడమే ఈ విన్యాసం ఉద్దేశమని స్పష్టం చేశారు. ఇది ఏ దేశానికీ వ్యతిరేకం కాదని తెలిపారు. డెన్మార్క్‌కు పూర్తి మద్దతు ప్రకటిస్తూ చర్చల ప్రాముఖ్యతను ఈయూ గుర్తుచేసింది. ఈ విషయంపై ఉర్సులా వాండెర్ లాన్ ఎక్స్ లో స్పందిస్తూ.. ప్రాదేశిక సమగ్రత మరియు సార్వభౌమాధికారం అంతర్జాతీయ చట్టం యొక్క ప్రాథమిక సూత్రాలని చెప్పారు. ఇవి యూరప్ తో పాటు మొత్తం అంతర్జాతీయ సమాజానికి అవసరమన్నారు. నాటో ద్వారా ఆర్కిటిక్‌లో శాంతి మరియు భద్రతపై మా ఉమ్మడి అట్లాంటిక్ ఆసక్తిని మేము నిరంతరం నొక్కిచెప్పామని వాండెర్ లాన్ పేర్కొన్నారు.

## 50 ఏళ్ల కిందట రూ.7 చోరీ

**ఎట్టకేలకు మూసేసిన ముంబై కోర్టు**

ముంబై: మహారాష్ట్రలో 50 ఏళ్ల నాటి ఓ చోరీ కేసు కు ఎట్టకేలకు తెరపడింది. ఈ కేసులోని ఇద్దరు నిందితులు, ఫిర్యాదుదారుడి కోసం పోలీసులు అనేక ఏళ్లుగా వెతుకుతున్నప్పటికీ ఆచూకీ లభించలేదు. దాంతో కేసుకు ముగింపు పలుకుతున్నట్లు ముంబైలోని స్థానిక కోర్టు ప్రకటించింది. దక్షిణ ముంబైలోని మజగావ్ న్యాయస్థానం పాత కేసులపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా 1977 నాటి రూ.7.65 చోరీ కేసు పెండింగులో ఉన్న విషయాన్ని గుర్తించింది. అప్పట్లో ఇది పెద్ద మొత్తమే. చోరీ సొమ్మును రికవరీ చేసినప్పటికీ దాన్ని ఫిర్యాదుదారుకు తిరిగి ఇవ్వలేదు. ఎందుకంటే నాన్-బెయిలబుల్ వారెంట్‌లు జారీచేసినా నిందితులుగానీ, ఎంత వెతికినా ఫిర్యాదుదారుగానీ దొరకలేదు. ఫలితంగా కేసు దశాబ్దాలుగా మరుగునపడిపోయింది. ఈ పెండింగ్ కేసును ఇటీవల న్యాయస్థానం విచారించింది. దాదాపు యాభై ఏళ్లుగా కేసు పెండింగ్‌లో ఉన్నదని, ఎలాంటి పురోగతి లేదని, అలాంటప్పుడు కేసును పెండింగ్‌లో ఉంచడంలో అర్థం లేదని అభిప్రాయపడింది. నిందితులపై ఉన్న అభియోగాలను కోర్టు కొట్టివేసింది. రికవరీ చేసిన సొమ్ము రూ.7.65 లను ఆచూకీ దొరికితే ఫిర్యాదుదారుడికి ఇవ్వాలని ఆదేశించింది. అప్పీలు గడువు ముగిసేనాటికి ఫిర్యాదుదారుడి ఆచూకీ లభించకపోతే ఆ మొత్తాన్ని ప్రభుత్వ ఖాతాలో జమచేయాలని సూచించింది.


## వయ్యారి చిత్రం



## మహారాజ 2 కోసం సేతుపతి రెడీ!



విజయ్ సేతుపతి ఒక ప్రాజెక్ట్ ఓకే చేస్తే అందులో కచ్చితంగా విషయం ఉంటుందని చాలా సినిమాలు ప్రూవ్ అయ్యాయి. వాటిల్లో మహారాజ కూడా ఒకటి. నిథిలన్ స్వామినాథన్ డైరెక్షన్ లో తెరకెక్కిన ఈ సినిమా కమర్షియల్ గానే కాదు ఎమోషనల్ గా సూపర్ గా వర్క్ అవుట్ అయ్యింది. అసలు ఈ సినిమా స్క్రీన్ ప్లే చూసిన ఆడియన్స్ షాక్ అయ్యారు. విజయ్ సేతుపతి కథా సెలక్షన్ పై మరింత కాన్ఫిడెన్స్ వచ్చేలా చేసింది ఈ మూవీ. ఈ నేపథ్యంలో సీక్వెల్ పనిలో దర్శక నిర్మాత, హీరో రెడీ అయ్యారు. సీక్వెల్ కథ దాదాపు లాక్ అయినట్టే తెలుస్తోంది. ప్రస్తుతం విజయ్ సేతుపతి పూరీ జగన్నాథ్ డైరెక్షన్ లో స్లమ్ డాగ్ సినిమా చేస్తున్నాడు. ఈ సినిమా పూర్తయ్యాక నిధిలన్ మూవీ ఉంటుంది. మహారాజ సీక్వెల్ సినిమా అనగానే ఆడియన్స్ లో ఒక ఆసక్తి మొదలైంది. తప్పకుండా ఈ సినిమా మరోసారి ఆడియన్స్ కి ఒక డిఫరెంట్ ఎక్స్ పీరియన్స్ అందించే ఛాన్స్ ఉంటుందని చెప్పొచ్చు. మహారాజ 2 సినిమాతో విజయ్ సేతుపతి మరోసారి తన మార్క్ చాటబోతున్నాడు. పూరీ సినిమా వెంటనే ఈ సీక్వెల్ వస్తే కెరీర్ పరంగా విజయ్ కు ప్లస్ అవుతుందని చెప్పొచ్చు. ఇక ఈమధ్య విలన్ పాత్రలను వదిలి సోలో సినిమాలకే ప్రాధాన్యత ఇస్తున్న విజయ్ సేతుపతి పూరీ సినిమాతో భారీ టార్గెట్ పెట్టుకున్నాడని తెలుస్తుంది. తమిళ ఆడియన్స్ మాత్రమే కాదు తెలుగులో విజయ్ సేతుపతికి మంచి ఫాలోయింగ్ ఉంది. ఆల్రెడీ ఇక్కడ ఉప్పెనలో శేషారాయణం పాత్రలో అదరగొట్టిన విజయ్ సేతుపతి రాబోతున్న పూరీ సినిమాతో స్ట్రైట్ తెలుగు ఆడియన్స్ ని సర్ ప్రైజ్ చేయబోతున్నాడు. ఇక మహారాజ 2 సినిమాపై కూడా ఆడియన్స్ క్రేజ్ చూస్తుంటే ఈ సీక్వెల్ కూడా విజయ్ స్టామినా ప్రూవ్ చేసేలా ఉందని చెప్పొచ్చు.





## 2028 కి పుష్ప 3 రెడీ

పుష్ప పుష్ప రాజ్ అంటూ పాన్ ఇండియా బాక్సాఫీస్ లెక్కలు సెట్ చేశాడు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్. సుకుమార్ డైరెక్షన్ లో తెరకెక్కిన ఈ సినిమా బన్నీకి నేషనల్ వైడ్ భారీ ఫాలోయింగ్ వచ్చేలా చేసింది. పుష్ప 1 అండ్ 2 సినిమాలతో అల్లు అర్జున్ మాస్ స్టామినా ప్రూవ్ అయ్యింది. పార్ట్ 2 తో కథ ముగిస్తాడని అనుకోగా సుకుమార్ ఈ సినిమాను మూడో పార్ట్ కూడా ప్లాన్ చేశాడు. పుష్ప 3 రాంపేజ్ అనే పోస్టర్ వేసి సర్ ప్రైజ్ చేశాడు. ఐతే పుష్ప పార్ట్ 3 ఎప్పుడు మొదలవుతుంది అంటే.. పుష్ప 3 సినిమా పనులు ఆల్రెడీ సుకుమార్ మొదలు పెట్టాడని అంటున్నారు. ప్రస్తుతం అల్లు అర్జున్ అట్లీ సినిమా షూటింగ్ లో బిజీగా ఉన్నాడు. నెక్స్ట్ సినిమాగా లోకేష్ తో ప్రాజెక్ట్ ఫిక్స్ చేసుకున్నాడు. ఐతే అట్లీ సినిమా నెక్స్ట్ ఇయర్ రిలీజ్ ఉండగా లోకేష్ సినిమాతో పాటు పుష్ప 3 కూడా చేస్తాడని తెలుస్తుంది. సుకుమార్ ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ పనులు పూర్తి చేశాడట. పుష్ప 2 చివర్లో తన ఫ్యామిలీని మొత్తం బ్లాస్ట్ చేయగా అల్లు అర్జున్ అడవుల్లోకి వెళ్తాడు. పార్ట్ 3 కథ ఎక్కువ భాగం ఫారెస్ట్ లోనే ఉంటుందట. ఆ తర్వాత మళ్లీ తన సామ్రాజ్యాన్ని ఎలా దక్కించుకున్నాడు అన్నదే పుష్ప 3 కథ అని తెలుస్తోంది.



## రవితేజ లెక్క.. ప్రేక్షకులకు కిక్కు!



మాస్ మహరాజ్ రవితేజ భర్త మహాశయులకు విజ్ఞప్తి సినిమా సంక్రాంతికి రిలీజైంది. ఆ సినిమా రవితేజ వరుస ఫ్లాపుల నుంచి బయట పడేసింది. ఐతే సినిమా ఓ సూపర్ హిట్ అనే మూమెంట్ లేదు కానీ రవితేజ చివరి 3 సినిమాల ఫలితాలతో పోలిస్తే మాత్రం బెటర్ అని చెప్పొచ్చు. కిషోర్ తిరుమల డైరెక్షన్ లో తెరకెక్కిన భర్త మహాశయులకు విజ్ఞప్తి సినిమా లో డింపుల్ హయతి, ఆషిక రంగనాథ్ ఇద్దరు హీరోయిన్స్ నటించారు. సినిమాలో ఆషిక గ్లామర్ షో ప్లస్ అయ్యింది. ఈ సినిమా ఇచ్చిన జోష్ తో రవితేజ మళ్లీ తన ఎనర్జీని డబల్ చేసుకుని నెక్స్ట్ సినిమాలకు పనిచేస్తాడు. రవితేజ శివ నిర్వాణ డైరెక్షన్ లో సినిమా లాక్ చేసుకున్నాడు. భర్త మహాశయులకు విజ్ఞప్తి సినిమాతో ఆడియన్స్ తనను ఎలా చూడాలని అనుకుంటున్నారో రవితేజకు తెలిసింది కాబట్టి రెగ్యులర్ మాస్ సినిమాలకు కాస్త బ్రేక్ ఇచ్చి తన మార్క్ ఎంటర్టైనర్ సినిమాలతో వస్తే బెటర్ అని చెప్పొచ్చు. భర్త మహాశయులకు విజ్ఞప్తి సినిమా చూసిన మాస్ రాజా ఫ్యాన్స్ కూడా సాటిస్ఫైడ్ అవుతున్నారు. సో ఫ్యాన్స్ ని ఇంప్రెస్ చేసే ప్రయత్నంలో రవితేజ మాస్ కాదు ఇక మీదట ఎంటర్టైన్మెంట్ ప్రాధాన్యత ఉన్న ప్రాజెక్ట్ లు చేస్తే బెటర్ అనిపిస్తుంది. సినిమా రిజల్ట్ తో సంబంధం లేకుండా రవితేజ వరుస సినిమాలు చేస్తాడు. కానీ మాస్ జాతర ఫ్లాప్ తో కాస్త ఆలోచనలో పడ్డ రవితేజ మాస్ కాదు ఆడియన్స్ ని మెప్పించే ఎంటర్టైనింగ్ కథలు చేయాలని ఫిక్స్ అయ్యారు.

## ఏఆర్ రహమాన్ గుడ్డివాడు



ఇటీవల లెజెండరీ సంగీత దర్శకుడు, ఆస్కార్ గ్రహీత ఏ.ఆర్.రహమాన్ మత వివక్ష వ్యాఖ్యలు సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. సోషల్ మీడియాలలో దీనిపై బిగ్ డిబేట్ నడుస్తోంది. అయితే ఈ వ్యాఖ్యలకు కౌంటర్ గా బాలీవుడ్ నటి ఎంపీ కంగనా రనౌత్ సూటిగా ఏఆర్ రహమాన్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు సినీ, రాజకీయ వర్గాల్లో సంచలనంగా మారాయి. ముక్కనుమ పండగ (జనవరి 17) రోజున కంగన తన ఇన్‌స్టా వేదికగా రెహమాన్‌పై తీవ్రమైన ఆరోపణలు చేశారు. ఈ వివాదం పూర్తి వివరాల్లోకి వెళితే.. ఇటీవల ఏఆర్ రహమాన్ బాలీవుడ్‌లో మతపరమైన వివక్ష ఉందని, అందుకే తనకు అవకాశాలు తగ్గుతున్నాయనే అర్థం వచ్చేలా మాట్లాడారు. దీనిపై స్పందించిన క్వీన్ కంగనా సూటిగా రహమాన్ను టార్గెట్ చేస్తూ ఘాటైన పోస్ట్ చేశారు. మీకంటే ద్వేషపూరితమైన వ్యక్తిని చూడలేదు! అంటూ కంగన ఫైరయ్యారు. నేను ఒక రాజకీయ పార్టీకి (బీజేపీ) మద్దతు ఇస్తున్నందున పరిశ్రమలో ఎంతో వివక్ష ఎదుర్కొంటున్నాను.

## అంచనాలు పెంచేస్తున్న కట్టాలన్ టీజర్!

మాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో భారీ అంచనాల మధ్య తెరకెక్కుతున్న యాక్షన్ థ్రిల్లర్ కట్టాలన్ టీజర్ ను మేకర్స్ రీసెంట్ గా రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. మలయాళ నటుడు ఆంటోని వర్గీస్ హీరోగా నటిస్తుండగా, దుషారా విజయన్ హీరోయిన్ గా కనిపించనున్నారు. డెబ్యూ డైరెక్టర్ పాల్ జార్జ్



దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఆ చిత్రాన్ని క్యూబ్స్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై షరీఫ్ మహమ్మద్ నిర్మిస్తున్నారు. బ్లాక్ బస్టర్ మార్కో సినిమాను నిర్మించిన క్యూబ్స్ సంస్థ.. ఈసారి అంతకుమించిన స్థాయిలో యాక్షన్ థ్రిల్లర్ ను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. ఇప్పటికే మూవీ నుంచి విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ సినిమాపై భారీ బజ్ క్రియేట్ చేసింది. ఇప్పుడు పవర్ ఫుల్ యాక్షన్ ఎలిమెంట్స్ తో రూపొందిన టీజర్ సినిమాపై అంచనాలను పెంచింది. టీజర్ లో హై వోల్టేజ్ యాక్షన్, రగ్డ్ విజువల్స్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



## కృతి శెట్టి వర్సెస్ కీర్తి సురేష్

టాలీవుడ్, కోలీవుడ్‌లో కలిసి రాకపోవడంతో కృతి శెట్టి బాలీవుడ్ లో సినిమా చేస్తోంది అంటూ వార్తలు వినిపించాయి. దీనికి తోడు గతంలో కృతి శెట్టి ముంబైలో కనిపించడంతో.. బాలీవుడ్ ఆఫర్ వచ్చిందని అందుకే ఆమె అక్కడే ఆడిషన్ కి హాజరవుతోంది అని కూడా వార్తలు వచ్చాయి. అయితే చివరికి కృతి శెట్టికి బదులుగా ఆ ప్రాజెక్టులోకి కీర్తి సురేష్ ఎంటర్ అయినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈమె బేబీ జాన్ సినిమాతో హిందీలో అడుగుపెట్టినా.. ఆ సినిమా ఫ్లాప్ అయింది. కనీసం ఈ సినిమా అయినా ఈమెకు కలిసి వస్తుందా? అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు అభిమానులు.






# సిరీస్ సమర్పయామి!

## తొలిసారి న్యూజిలాండ్‌కు సిరీస్ అప్పగింత.. కోహ్లీ సెంచరీ వృథా

నిర్ణయాత్మక మూడో వన్డేల్లో విరాట్ కోహ్లీ (124) సెంచరీతో గర్జించినా టీమిండియాకు ఓటమి తప్పలేదు. ఇండోర్‌లో 338 పరుగుల ఛేదనలో ఒంటరి సైనికుడిలా పోరాడిన విరాట్‌కు హర్షిత్ రానా(52) అండగా నిలిచాడు. కానీ, రానా ఔటయ్యాక వరుసగా రెండు ఫోర్లు బాదిన కోహ్లీ.. 46వ ఓవర్ నాలుగో బంతికి వెనుదిరిగాడు.



**చివరి బంతికి కుల్దీప్ యాదవ్ రనౌట్ కావడంతో న్యూజిలాండ్ 41 రన్స్ తేడాతో గెలుపొందింది. భారత గడ్డపై ఆ జట్టుకు ఇదే మొట్టమొదటి ద్వైపాక్షిక వన్డే సిరీస్ విజయం కావడం విశేషం. భారత జట్టును స్వదేశంలో ఓడించడం ఏ జట్టుకైనా కష్టమే. కానీ, న్యూజిలాండ్ రెండోసారి సిరీస్ విజయంతో మేమున్నామని నిరూపించింది.**

రెండేళ్ల క్రితం టెస్టు సిరీస్ పట్టేసిన కివీస్.. ఈసారి వన్డే సిరీస్‌నూ ఒడిసిపట్టింది. ఇండోర్‌లో ఆద్యంతం ఆసక్తిగా, ఉత్కంఠగా సాగిన మూడో వన్డేలో టీమిండియాపై 41 పరుగుల తేడాతో గెలుపొందింది బ్లాక్‌క్యాప్స్. భారీ ఛేదనలో విజయం దోబూచులాడిన పోరులో విరాట్ కోహ్లీ(124) భారత్‌ను గెలిపించేందుకు చివరిదాకా పోరాడాడు. కానీ, హర్షిత్ రానా(52) వికెట్ పడడంతో.. కోహ్లీ వేగంగా ఆడేందుకు ప్రయత్నించి ఔటయ్యాడు. అతడు ఔటైన మరో రెండు బంతులకే ఇండియా ఆలౌటైంది. 2-1తో కివీస్ వన్డే సిరీస్ విజేతగా నిలిచింది. న్యూజిలాండ్ నిర్దేశించిన భారీ ఛేదనను టీమిండియా ఓపెనర్లు రోహిత్ శర్మ(11), శుభ్‌మన్ గిల్(23) దూకుడగా ఆరంభించారు. కానీ, రోహిత్ మరోసారి స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగాడు. క్రీజులో కుదురుకున్నట్టే కనిపించిన కెప్టెన్ గిల్‌ను జేమీసన్ బౌల్డ్ చేశాడు. దాంతో, పవర్ ప్లేలోనే 45కే ఓపెనర్లు ఔటయ్యారు. పెద్ద షాట్‌కు యత్నించిన శ్రేయాస్ అయ్యర్(3) మిడాఫ్‌లోనే క్యాచ్ ఇవ్వగా.. కేఎల్ రాహుల్(1) సైతం స్పిన్నర్ లెనాక్స్ బౌలింగ్‌లో సులువైన క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరారు. ఆ తర్వాత నితీశ్ కుమార్ రెడ్డి(53).. హర్షిత్ రానా(52)లుతో కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు కోహ్లీ. రానా సిక్సర్లతో చెలరేగి తొలిఅర్ధశతకం సాధించాడు. విజయానికి 61 రన్స్ అవసరమైన వేళ.. డైవింగ్ క్యాచ్‌తో పెవిలియన్ చేరాడు. ఆ తర్వాత బంతికే సిరాజ్ వికెట్ కీపర్ చేతికి చిక్కాడు. దాంతో.. ఐదు ఓవర్లలో.. 54 రన్స్ అవసరమయ్యాయి. కానీ, రానా ఔటయ్యాక కోహ్లీ గేర్ మార్చాల్సి వచ్చింది. అయితే.. ధాటిగా ఆడే క్రమంలో అతడు బౌండరీ వద్ద మిచెల్ చేతికి చిక్కాడు. అంతే.. మ్యాచ్ చేజారింది. గ్లెన్ ఫిలిప్స్ మెరుపు త్రోకు కుల్దీప్ రనౌట్ కావడంతో 46 ఓవర్లో 296కే టీమిండియా కుప్పకూలింది. నిర్ణయాత్మక మూడో వన్డేలో న్యూజిలాండ్ మిడిలార్డర్ బ్యాటర్లు దంచేశారు. 5 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన కివీస్‌ను ఒత్తిడిలోకి నెట్టాలనుకున్న భారత బౌలర్ల వ్యూహాలను తిప్పికొడుతూ డారిల్ మిచెల్(137), గ్లెన్ ఫిలిప్స్(106) కొండంత స్కోర్ అందించారు. క్రీజులో కుదురుకున్న ఈ ద్వయం మిడిల్ ఓవర్లలో ఎడాపెడా ఫోర్లు, చెలరేగి స్కోర్ బోర్డును ఉరికించింది. సెంచరీ తర్వాత ఇద్దరూ ఔట్ కావడంతో స్కోర్ వేగం తక్కింది. ఆఖర్లో కెప్టెన్ మైఖేల్ బ్రేస్‌వెల్(28 నాటౌట్) ధనాధన్ ఆటతో స్కోర్ 330 దాటించాడు. దాంతో, టీమిండియాకు పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.

## టీమిండియాకు మరో హెడ్
# డారిల్ మిచెల్

న్యూజిలాండ్ బ్యాటర్ డారిల్ మిచెల్ టీమిండియాకు పెద్ద తలనొప్పిగా మారాడు. ఆస్ట్రేలియా విధ్వంసకర ఓపెనర్ ట్రావిస్ హెడ్ తరహాలోనే భారత్ అంటే చెలరేగిపోతున్నాడు. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా ఇండోర్ వేదికగా జరిగిన చివరి మ్యాచ్‌లోనూ డారిల్ మిచెల్ మరో శతకంతో చెలరేగాడు. ఈ సిరీస్‌లో అతనికి ఇది వరుసగా రెండో సెంచరీ కాగా.. మూడో 50 ప్లస్ స్కోర్. వడోదర వేదికగా జరిగిన తొలి వన్డేలో 84 పరుగులతో తృటిలో శతకం చేజార్చుకున్న డారిల్ మిచెల్.. రాజ్‌కోట్‌లో అజేయ శతకంతో(131 నాటౌట్) భారత్ పతనాన్ని శాసించాడు. సిరీస్ డిసైడర్ మ్యాచ్ అయిన ఇండోర్ వన్డేలో 137 పరుగులతో రాణించాడు. భారత్ గడ్డపై టీమిండియాతో వరుసగా ఆడిన ఐదు ఇన్నింగ్స్‌ల్లో డారిల్ మిచెల్ నాలుగు సెంచరీలు బాదాడు. తద్వారా భారత్ అంటే తనకు ఎంత ఇష్టమో తెలియజేశాడు. ఇండోర్‌లో చాలా ప్రశాంతంగా బ్యాటింగ్ చేసిన మిచెల్.. జడేజా బౌలింగ్‌లో సింగిల్ తీసి 106 బంతుల్లో సెంచరీ మార్క్ అందుకున్నాడు. అనంతరం గట్టిగా అరుస్తూ సంబరాలు చేసుకున్నాడు. డారిల్ మిచెల్‌అబశ్రీశ్రీకు ఇది ఓవరాల్‌గా 9వ సెంచరీ కాగా..



ఇందులో భారత్‌పైనే నాలుగు శతకాలు అందుకున్నాడు. దాంతో డారిల్ మిచెల్‌ను మరో ట్రావిస్ హెడ్ అంటూ అభిమానులు పిలుస్తున్నారు. డారిల్ మిచెల్ టీమిండియాకు మొగుడిలా తయారయ్యాడని సోషల్ మీడియా వేదికగా కామెంట్ చేస్తున్నారు. ఈ సిరీస్‌లో మూడు మ్యాచ్‌ల్లో కలిపి మొత్తం 352 పరుగులు చేశాడు. తద్వారా భారత్ గడ్డపై మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన తొలి ఓవర్‌సీస్ బ్యాటర్‌గా డారిల్ మిచెల్ నిలిచాడు. ఈ క్రమంలో అతను 44 ఏళ్ల రికార్డ్‌ను బద్దలు కొట్టాడు. 1982లో శ్రీలంక బ్యాటర్ రాయ్ డయాస్ 262 పరుగులతో ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉండగా.. డారిల్ మిచెల్ తాజాగా అధిగమించాడు. ఈ జాబితాలో డారిల్ మిచెల్(352) తర్వాత రాయ్ డయాస్(262), మార్లోన్ సామ్యూల్స్(254), ఆరోన్ ఫించ్(250), ఏబీ డివిలియర్స్(241) తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

### 44 ఏళ్ల రికార్డ్ బద్దలు

డారిల్ మిచెల్ చరిత్ర సృష్టించాడు. మూడు మ్యాచ్‌ల ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లో భారత గడ్డపై అత్యధిక పరుగులు చేసిన తొలి ఓవర్‌సీస్ బ్యాటర్‌గా నిలిచాడు. ఇండోర్ వేదికగా ఆదివారం జరిగిన మూడో వన్డేలో సెంచరీ సాధించడం ద్వారా డారిల్ మిచెల్(131 బంతుల్లో 15 ఫోర్లు, 3 సిక్స్‌లతో 137) ఈ ఫీట్ సాధించాడు. ఈ మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో డారిల్ మిచెల్ వరుసగా.. 84, 131, 137లతో మొత్తం 352 పరుగులు చేశాడు. ఈ క్రమంలో అతను 44 ఏళ్ల రికార్డ్‌ను బద్దలు కొట్టాడు. 1982లో శ్రీలంక బ్యాటర్ రాయ్ డయాస్ 262 పరుగులతో ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉండగా.. డారిల్ మిచెల్ తాజాగా అధిగమించాడు. ఈ జాబితాలో డారిల్ మిచెల్(352) తర్వాత రాయ్ డయాస్(262), మార్లోన్ సామ్యూల్స్(254), ఆరోన్ ఫించ్(250), ఏబీ డివిలియర్స్(241) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఇందులో ఆరోన్ ఫించ్, మార్లోన్ సామ్యూల్స్ ఐదు వన్డేల సిరీస్ ఆడినప్పటికే వారు మూడు మ్యాచ్‌ల్లోనే బరిలోకి దిగారు. మూడు వన్డేల ద్వైపాక్షిక వన్డే సిరీస్‌ల్లో అత్యధిక పరుగులు చేసిన మూడో బ్యాటర్‌గా కూడా మిచెల్ నిలిచాడు. ఈ జాబితాలో బాబర్ ఆజామ్, శుభ్‌మన్ గిల్ 360 పరుగలతో అగ్రస్థానంలో కొనసాగుతున్నారు.





# ఒక ఓవర్.. ఒక రన్.. 5 వికెట్లు

క్రికెట్ ప్రపంచంలో రషీద్ ఖాన్, లసిత్ మలింగ వంటి దిగ్గజ బౌలర్లకు కూడా సాధ్యం కాని ఓ అరుదైన రికార్డును ఇండోనేషియాకు చెందిన గేడే ప్రియందానా నెలకొల్పాడు. కేవలం ఒకే ఓవర్లో 5 వికెట్లు పడగొట్టి టీ20 అంతర్జాతీయ క్రికెట్ చరిత్రను తిరగరాశాడు. బాలీలో కంబోడియాతో జరిగిన మ్యాచ్‌లో 28 ఏళ్ల పార్ట్-టైమ్ మీడియం పేసర్ గేడే ప్రియందానా ఈ ఘనత సాధించాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఒకే ఓవర్లో 5 వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా ప్రియందానా రికార్డు సృష్టించాడు. ఓవర్ మొదటి 3 బంతుల్లో వరుసగా ముగ్గురు బ్యాటర్లను ఔట్ చేసి హ్యాట్రిక్ సాధించాడు. ఆ ఓవర్‌లో వచ్చిన ఏకైక పరుగు కేవలం ఒక వైడ్ ద్వారా మాత్రమే వచ్చింది. ఓవర్ చివరి రెండు బంతుల్లో మరో ఇద్దరిని ఔట్ చేసి, మొత్తం ఒకే ఓవర్లో 5 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. ఇప్పటివరకు అంతర్జాతీయ టీ20ల్లో ఒకే ఓవర్లో 4 వికెట్లు తీసిన రికార్డు లసిత్ మలింగ (శ్రీలంక), రషీద్ ఖాన్ (అఫ్గానిస్థాన్), జేసన్ హోల్డర్ (వెస్టిండీస్), కర్టిస్ కాంఫర్ (ఐర్లాండ్) పేరిట ఉంది. కానీ 5 వికెట్ల మార్కును అందుకున్న ఏకైక వీరుడు ప్రియందానా మాత్రమే.

# ఆస్ట్రేలియా ఓపెన్‌లో అల్కరాస్ దూకుడు!

కొత్త ఏడాదిని టాప్ సీడ్స్ ఘనంగా ఆరంభించారు. ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్‌లో కార్లోస్ అల్కరాస్, మహిళల ఫేవరెట్ ఎమ్మా రాడుకాను అలవోక విజయంతో ముందంజ వేశారు. మెల్‌బోర్న్ పార్క్‌లో జరుగుతున్న ఈ గ్రాండ్‌స్లామ్ తొలి పోరులో 38 విన్నర్స్‌తో ఆడం వాల్టన్‌పై విరుచుకుపడిన అల్కరాస్ ఈ సీజన్‌లో మొదటి విజయం నమోదు చేశాడు. తొలి రౌండ్‌లో అల్కారస్‌కు ఆడమ్ వాల్టన్ గట్టిపోటీనిచ్చాడు. తొలి సెట్ 6-3తో గెలుపొందిన స్పెయిన్ కుర్రాడికి షాకిస్తూ.. రెండో సెట్‌లో (7-6) ఒక్క పాయింట్‌తో సొంతం చేసుకున్నాడు ఆడమ్. అయితే.. నిర్ణయాత్మక సెట్‌లో జోరు చూపించిన అల్కరాస్ 6-2తో ప్రత్యర్థిని మట్టికరిపించాడు. రెండో రౌండ్‌లో యన్నిక్ హన్ఫమన్‌తో అతడు తలపడనున్నాడు. మహిళల సింగిల్స్‌లో బ్రిటీష్ టెన్నిస్ స్టార్ ఎమ్మా రాడుకాను పవర్‌ఫుల్ షాట్లతో ప్రేక్షకులను అలరించింది. అనారోగ్యం కారణంగా గతేడాది పలు టోర్నీలకు దూరమైన తను.. ఆస్ట్రేలియా ఓపెన్ లక్ష్యంగా పెట్టుకుంది. ఆదివారం జరిగిన తొలి రౌండ్‌లో థాయ్‌లాండ్ కు చెందిన మనన్‌చయ సవాంగ్క్వేను వరుస సెట్లలో (6-4, 6-1) చిత్తుగా ఓడించింది. ఏకపక్ష విజయంతో ఎమ్మా రెండో రౌండ్‌కు దూసుకెళ్లింది.





# త్రివర్ణంలో త్రినేత్రుడు..

త్రివర్ణాలలో త్రినేత్రుడి మహాదర్శనం.. అపురూపం.. అపూర్వం. భూమి ఆకాశాలను కలుపుతున్నట్లుగా ఉమాశంకరుడు స్వయంభువుగా అవతరించి భక్తుల మనోరథాలు ఈడేరుస్తున్నాడు. మన భూమిపైన మనకు అందుబాటులో సాక్షాత్కరిస్తున్నాడు. ఇది వింత కాదు.. విడ్డూరం అంతకంటే కాదు.. పుక్కిటి పురాణం ఎంతమాత్రం కాదు. నిజం. ఒకటి కాదు, రెండు కాదు.. మూడు రంగుల్లో ముక్కంటి తన భక్తుల ముచ్చట తీరుస్తున్న వాస్తవం.

భూమిపై కైలాసాలు ఎన్ని ఉన్నాయి, మహాదేవుడి అసలు నివాసం ఎక్కడ, టిబెట్లోని మానస సరోవరం పాదతీర్థంగా ఉన్న కైలాస పర్వతం కాకుండా, మరో కైలాసం ఉందా? అవును.. దేవదేవుడు హిమాలయ శ్రేణులనిండా విస్తరించి ఉన్నాడు. హిమాలయాలకు అన్ని వైపులా కైలాస పర్వతాలు నెలకొని ఉన్నాయి. ప్రతిచోటా పలు రూపాల్లో పరమేష్టి భక్తులను అనుగ్రహిస్తున్నాడు. మహాదేవుడు మూడు రంగుల్లో భక్తులకు దర్శనమిస్తున్న వైనం ఇది. హిమాలయాల్లో శివుడు మరో కైలాసంలో దర్శనమిస్తున్నాడు. మూడు రంగుల్లో త్రినేత్రుడు తొంబై అడుగుల ఎత్తైన సహజసిద్ధ శివలింగంగా కనిపిస్తున్నాడు.. ఒక రోజులో మూడు వర్ణాలు మారే శివలింగం.. దేవభూమిలో మహాద్భుత దృశ్యం ఆవిష్కారమైంది. అత్యంత ఎత్తైన మంచు కొండల పైన, నిటారుగా, నిరాకారంగా వెలసిన మహాద్భుత అవతారం. 17,500 అడుగుల చుట్టు కొలత... 18వేల అడుగుల ఎత్తున మహా శివలింగం.

# కిన్నెర కైలాసం

## హిమాలయాల్లో మరో కైలాసం..

**లింగరూపంలో మహాదేవుడు.. త్రివర్ణాలలో త్రినేత్రుడి దివ్య దర్శనం**

**ఉమాపతి రెండో కైలాసం.. మహాదేవుడికి మరో కైలాసం**

**దేవభూమిలో దివ్యధామం.. లింగరూపుడై దర్శనమిస్తున్న పరమేశ్వరుడు**

**ఉదయం రజతం... మధ్యాహ్నం సువర్ణం...**
**సాయంత్రం నీలమేఘం... మూడు వర్ణాల్లో ముక్కంటి..**



*ఆధ్యాత్మిక క్షేత్రంలో అపురూప సన్నివేశం. బోళా శంకరుడికి రెండో కైలాసం ఏమిటని ఆశ్చర్యపోకండి.. ఇది వాస్తవం.. ఆయన నిజంగానే బోళా శంకరుడు.. అందుకే భక్తులను ఇబ్బంది పెట్టకుండా సులభ సాధ్యుడయ్యాడు. కోరుకున్న చోటనే దర్శన మిస్తున్నాడు. అదే ఈ రెండో కైలాసం. మౌంట్ కైలాస పర్వతం మాత్రమే కాదు.. అది ఆయన నిజనివాసం కావచ్చు. కానీ, శివుడికి రెండో కైలాసం హిమాచలంలోనే ఉంది. సముద్రమట్టానికి వేల అడుగుల ఎత్తున ఉంది. భక్తులను పలు వర్ణాల్లో అలరిస్తోంది. వారికి అందుబాటులో ఉంది. కొంచెం కష్టపడితే లయకారుడి దివ్యదర్శనం లభ్యమ వుతోంది. కిన్నెర కైలాసం.*

పరమేశ్వరుడి నిజ కైలాసాన్ని మరిపించే కైలాసం.. చూస్తున్న కొద్దీ చూడాలనిపించే కైలాసం. అణువణువునా ఆధ్యాత్మికత నిలువునా కమ్మేసే అపురూప ప్రదేశం. అక్కడ శివలింగం రంగులు మారటం విశేషం. ఒకే ప్రాంతంలో.. ఒకే చోట.. నిశ్చలంగా ఉన్న శివలింగం ఏ విధంగా రంగులు మారుతోంది.. ఇదెలా సాధ్యపడుతోంది? శివలింగం రంగులు మారటం ఏమిటి? శివుడి మాహాత్మ్యమా? మాయా? నిజంగా ఈశ్వరుడి లీలలు అక్కడ కనిపిస్తున్నాయా? అంటే అవుననే చెప్పాలి. హిమాచల ప్రదేశ్లో కిన్నెర్ ప్రాంతం.. టిబెట్ కు తూర్పున హిమాచల్ ప్రదేశ్ దాకా కొనసాగే హిమాలయ శ్రేణి అంతా దేవ భూమి.. ఒక అద్భుతమైన వాతావరణం.. మౌనంగా ఉన్నా, గాలిలో ఈశ్వరుడి పేరు ప్రతిధ్వనించే పాంతం. హిమాచల్ ప్రదేశ్ రాజధాని సిమ్లాకు సరిగ్గా 235 కిలోమీటర్ల దూరంలో కిన్నెర్ జిల్లా ఉంది. కిన్నెర్ జిల్లా హిమాలయ పర్వత సానువుల్లో.. నిజంగా అందాల కోన.. మూడు హిమాలయ పర్వతాలు పక్కపక్కనే పేర్చినట్లు ఉంటాయి. జనస్కర్, గ్రేటర్ హిమాలయ, దౌలంధర్ శ్రేణులు సట్లెజ్, స్పిటి, బాస్పా వంటి జీవనదులకు పుట్టినిళ్లు. వీటి మధ్యలోనే అన్నింటికంటే అత్యంత ఎత్తుగా కిన్నెర కైలాస్ పర్వతం కొలువుదీరి ఉంది. సట్లెజ్ నదీతీరంలో అందమైన జలపాతాల నడుమ 18వేల అడుగుల ఎత్తులో ఈ పర్వతాన్ని చూడటానికి వేయి కన్నులున్నా సరిపోవు..



- కోవెల సంతోష్ కుమార్,
రచయిత
ఫోన్ నంబర్: 9052116463

**ఈ** కొండపైనే సహజ సిద్ధమైన శివలింగం ఆవిర్భవించి ఉంది. యోగులకు, సిద్ధులకు మాత్రమే కాదు.. సామాన్యులకు కూడా సాక్షాత్కరించే అతి గొప్ప శివలింగం. తొంబై అడుగుల ఎత్తైన శివలింగం. ఇది అలాంటిలాంటి శివలింగం కాదు.. మనం సాధారణంగా చూసే మాదిరిలో దీని ఆకారం ఉండదు.. కిన్నెర కైలాసం పీక్ స్టేజ్లో నిటారుగా నిలుచుని ఉన్న రాతినే శివలింగంగా భక్తులు భావిస్తారు. కేవలం రాయిని శివలింగంగా ఎందుకు భావించారు? అదే ఇక్కడి ప్రత్యేకత. ఇది కేవలం రాయి కాదు.. ఇందులో జీవశక్తి వుందని ఇక్కడ ఉపాసించే సిద్ధుల దృఢమైన అభిప్రాయం. ఎందుకంటే ఈ శివలింగం రోజులో మూడు కాలాల్లో మూడు రంగుల్లో కనిపిస్తుంది. నిర్దిష్ట సమయానికి శివలింగం రంగు మారుతుంది. అత్యంత ఎత్తైన ప్రాంతంలో ఉన్న ఈ శివలింగం ఉదయం భానుడి లేలేత కిరణాల స్పర్శతో మిలమిలా మెరిసిపోతుంది.. వెండి రాశి పోతపోసుకున్నట్లుగా తెల్లగా ఈ శివలింగం దర్శనమిస్తుంది. మధ్యాహ్నానికి సూర్యుడు నడినెత్తిమీదకు వచ్చేసరికి పసిడి వన్నెలోకి మారిపోతుంది. ఇదే మహాలింగం సాయంత్రం అయ్యేవేళకు నీలిరంగులో ధగధగలాడుతుంది. ప్రపంచంలో అతి గొప్ప పరిణామ క్రమం ఇది. శివలింగం ఉన్న ప్రాంతంలో మాత్రమే ఈ రంగులు మారుతున్నాయి. ముక్కంటి మాత్రమే ఈ విధంగా దర్శనమిస్తున్నాడు.. ఇది ఆయన లీలా విలాసమే. ప్రపంచంలో కిన్నెర కైలాసంలో మాత్రమే ఈ అద్భుతమైన సన్నివేశం కనిపిస్తుంది. అదీ ఈ శివలింగం నెలకొని ఉన్న ప్రాంతంలో మాత్రమే ఇలా రంగులు మారుతాయి. ఈ పరిణామం దేనికి సంకేతం? శివలింగం మాత్రమే కాదు. కిన్నెర కైలాస పర్వతానిదే ఒక ప్రత్యేకత. మౌంట్ కైలాసాన్ని మరిపించేది ఈ కిన్నెర కైలాసం మర్మం. కిన్నెర కైలాసంలో సహజసిద్ధంగా ఏర్పడిన శివలింగం మూడు వర్ణాల్లో కనిపించేందుకు ఇక్కడ ఉపాసకులు ఆసక్తికరమైన కథనాలను వినిపిస్తారు. ఉదయం వెండిరంగులో శివలింగం కనిపిస్తుంది. సూర్యుని కిరణాలు శివుడి తలపైవున్న జాబిల్లిని తాకుతాయి.

**జా**బిల్లి నుంచి వెలువడే వెన్నెలే ఈ తెలుపు రంగుకు కారణం.. ఈ వెన్నెలకు భూతనాథుడి ఒంటిపై ఉండే విభూతి తోడై అద్భుతంగా విరాజిల్లుతుందని శివభక్తులు చెప్తారు. మధ్యాహ్నానికి కిన్నెర శివలింగం పసిడి వన్నెలోకి మారిపోతుంది. శివుడు ధరించిన పులిచర్మం, పట్టపగలు తనపై నేరుగా పడే సూర్యుడి కిరణాలకు బంగారు రంగులో మెరిసిపోతుందిట. ఈ రంగు చుట్టూ ఉన్న మేఘాలపై ప్రసరించి మరింత అద్భుత దృశ్యం ఆవిష్కారమవుతుంది. సాయంకాలానికి ఈశ్వరుడి లయవిన్యాసం విశ్వరూపం దాలుస్తుంది. ఆయన కంఠంలో ఉన్న గరళం ఒక్కసారిగా చైతన్యవంతం అవుతుంది. గరళం నుంచి వెలువడే సెగలు ఒక్కసారిగా శివలింగాన్ని నీలివర్ణంలోకి మార్చేస్తాయి. ఇదొక అద్భుత సన్నివేశం.. అపురూప ప్రకృతి స్వరూపం. పురాణాలు చెప్పే కథనాలు ఆధ్యాత్మిక భావనను వెల్లడి చేస్తున్నాయి. ఈ కథలు, కథనాలు సైన్సు అంతుపట్టవు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రకృతిలో, సూర్యుడి ప్రస్థానంలో, వాతావరణంలో, హిమాలయ శ్రేణుల్లో సాగే మేఘాలు ఈ శివలింగాన్ని తాకుతూ వెళ్తాయి. అందువల్లే ఇక్కడ ప్రకృతిలో రంగుల మార్పులు జరుగుతాయని సైంటిస్టులు ఒకరకమైన అంచనా వేస్తుంటారు. సైంటిస్టులు చెప్పిన మాటలో లాజిక్ లేకపోలేదు. కానీ, ఇక్కడే అసలు ప్రశ్న ఎలాంటి జవాబుకూ చిక్కడం లేదు. ఎందుకంటే నిజంగా ప్రకృతిలో, వాతావరణంలో మార్పులవల్ల ఇలాంటివి ఏవైనా జరుగుతుంటే ఆ ప్రాంతం అంతటా అదే విధంగా రంగులు మారుతూ ఉండాలి.. కానీ, ఒక్క శివలింగం ఉన్న పరిసర ప్రాంతంలోనే ఇలా జరుగుతోంది.. కిన్నెర కైలాస పర్వత శ్రేణిలోనే వర్ణాల మార్పు జరుగుతోంది.. దీనికి మాత్రం ఇప్పటివరకు ఎవరూ జవాబు చెప్పలేకపోతున్నారు.. మరి ఇది నిజంగా ఈశ్వరుడి మాయా.. ఏమో?

సముద్ర మట్టానికి 18వేల అడుగుల ఎత్తున జరుగుతున్న అద్భుతం ఇది. సైన్సుకు ఎంతమాత్రం అందని, అంతుపట్టని ప్రకృతి విన్యాసం ఇది. కేవలం శివలింగం మాత్రమే కాదు.. మొత్తం కిన్నెర కైలాస్ పర్వతం అంతా శివుడి ఉనికిని, అస్తిత్వాన్ని, ఆయన తేజస్సును విరజిమ్ముతున్నది. అక్కడికి వెళ్లే భక్తులందరికీ ఇదే అనుభూతి కలుగుతోంది. హేతువాదులకు సైతం ఆధ్యాత్మిక భావనను కల్పించే వాతావరణం అక్కడిది. కైలాసాలు ఒకటి కంటే ఎక్కువ ఉండటం ఏమిటి? ఎలా ఏర్పడ్డాయి ఇవి? వీటికి స్థానిక కథనాలు చాలానే ఉన్నాయి. రుద్రుడు హిమాలయాలను సృష్టించినప్పుడు ఆయన తన గణాలకోసం ప్రత్యేక స్థానాలను ఏర్పాటు చేశాడు. అందులో కిన్నెరులకోసం ఏర్పాటు చేసిన ఆవాసస్థలమే కిన్నెర కైలాసం. ఇక్కడ కిన్నెరులు తనను ఆరాధించటం కోసం స్వయంభువుగా లింగరూపుడై అవతరించాడని ఇక్కడికి వచ్చే భక్తుల విశ్వాసం. శివుడి నిజనివాసం టిబెట్లోని కైలాస పర్వతం.. దాని చుట్టూ బయటి నుంచి ప్రదక్షిణ చేయటమే గొప్ప సాహసం.. కిన్నెర కైలాసం అలాంటిది కాదు.. ఇక్కడికి శివలింగం వరకు వెళ్లి స్పృశించి వచ్చే అవకాశం ఉంది.. కాకపోతే కిన్నెర కైలాసం ఒక్కోసారి మౌంట్ కైలాస్ని తలపిస్తుంది. కొన్ని వేళల్లో కిన్నెర కైలాసాన్ని చూస్తే, మౌంట్ కైలాస్కు, దీనికి అస్సలు తేడా కనిపించదు.. కైలాస పర్వతం, కిన్నెరకు వచ్చేసిందా? అన్నంత కన్ఫ్యూజన్ను క్రియేట్ చేస్తుంది. ఈ ప్రకృతి వింతను చూసి తీరాల్సిందే. శివుడికి కైలాసాలు కేవలం రెండే కాదు.. మొత్తం అయిదు కైలాసాలు ఉన్నాయని చెప్తారు.. వీటిలో మొదటిది మౌంట్ కైలాస్..ఇది టిబెట్లో ఉంది. రెండవది కిన్నెర కైలాస్.. హిమాచల్ ప్రదేశ్లోని కిన్నౌర్ జిల్లాలో ఉన్న గొప్ప పర్వతం ఇది. ఇక మూడవది మౌంట్ ఆది కైలాస్.. ఇది ఉత్తరాఖండ్లో లోని పితోర్అబశ్రీశ్రీ జిల్లాలో ఉంది. దీన్ని చోటా కైలాస్ అని కూడా పిలుస్తారు. హిమాచల్ ప్రదేశ్లోనే రాంపూర్ జిల్లాలో శ్రీఖండ్ కైలాసం ఉంది. ఇది నాలుగో కైలాసం. ఇదే రాష్ట్రంలో చంబా జిల్లాలో మణిమహేశ్ కైలాసం వుంది. మొత్తం అయిదు కైలాసాల్లో శివుడు ఆదిపురుషుడిగా, ఈశ్వరుడిగా నెలకొని వున్నాడు. భారత దేశ ఆధ్యాత్మిక క్షేత్రాల్లో హిమాలయాలకు ఉన్న ప్రాధాన్యం అంతా ఇంతా కాదు.. మన దేశానికి సంబంధించి భక్తి ఉద్యమం అంతా కూడా హిమాలయాలనుంచే ప్రారంభం అవుతుంది.. అక్కడే ముగుస్తుంది కూడా. హిమాలయ పర్వత శ్రేణులు విస్తరించిన ప్రాంతం అంతా దేవతల భూమిగా, దేవలోకంగా భారతీయులు గట్టిగా నమ్ముతారు. అక్కడి వాతావరణం కూడా అదే విధంగా ఆధ్యాత్మిక వాసనలను వెదజల్లుతుంటుంది. కిన్నెర కైలాసం అందులో పీక్ లెవల్లో ఉంది. దేవుణ్ణి నమ్మినా, నమ్మకపోయినా ఒక్కసారి అక్కడికి వెళ్లి వస్తే మానసికంగా మనిషిలో కలిగే మార్పు మాత్రం తిరుగులేనిది.

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం, మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.